
اصول ثلاثة

تفهيم السنة

www.Teluguislam.net

# ఇస్లాం మూల సూత్రాలు



సంకలనం

షేఖుల్ ఇస్లాం ముహమ్మద్, తమీమి
(ర.అ.)

اصول ثلاثة

تفهيم السنة

# ఇస్లాం మూల సూత్రాలు

మూలం

**షేఖుల్ ఇస్లాం ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్**

(రహ్మ.లై)

ప్రకాశకులు

**హదీస్ పబ్లికేషన్స్**

హైదరాబాద్, ఆం.ప్ర. ఇండియా

# USOOLE SALASA

# اصول ثلاثة

Islam Moola Sutralu (Telugu)


| | | |
|---|---|---|
| Author | : | Mohammed Bin Abdul Wahab.(R.A.) |
| Translator | : | Mohd. Azezur Rahman |
| Edited by | : | Hafiz Md. Abdur Rawoof Umari |
| Sponsered by | : | **Abdur Rahman Salama** |


All Right Reserved with Publishers


| | | |
|---|---|---|
| First Edition | : | July, 2007 |
| Copies | : | 3000 |
| Price | : | Not for Sale |

Published by

**HADITH PUBLICATIONS**

**S. Abdul Wahid**

H. No. 8-4-549/314, Netaji Nagar,
Erragadda, Hyderabad - 18(A.P.) India Phone : 23700081


***Copies can be had from :***


**ABDUR RAHMAN ANAS**
S/o H.Md. Abdur Rawoof Umari
B1/79, Western Colony,
Srisailam Dam (East), Kurnool Dist.
Cell : 9849492445, 9866024962

**NIZAM MOHIUDDIN**
H. No. 51-987A, Plot No. 17
SBI Colony, Near Water Works
Kurnool - 3.Ph : 08518-251525,

**HAFIZ. MD. FAROOQ, MADANI**
Islamic Gidance Centre,
P.O.Box No.2843, Hail. KSA.
Tel No. 009665029855,
04.065334748

**MD. ABDUL MASTAN**
H.No. 19-428/30, Z.P. Colony
Chilakalpudi, Machilipatnam,
Krishna Dist. 521002
Phone : 2500027

**G.K. COMMUNICATIONS**
K.G. Raod, Nandikotkur,
Kurnool Dist.,
Cell : 9440014224,
9885955981

**AL-ATHER ISLAMIC CENTER**
Purani Haveli, Hyderabad.
Ph : 914032901219

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్
(అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో)

**వ బిహీ నస్తయీను వస్సలాతు వస్సలాము అలా నబియ్యినా ముహమ్మదిఁ వ్వ అలా ఆలిహీ వ సహ్‌బిహీ అజ్‌మయీన్.**

ప్రశ్న : ప్రతి మనిషీ విధిగా తెలుసుకోవలసిన నాలుగు అంశాలు ఏవి?

**జవాబు :** మొదటిది - ఇల్మ్, అంటే దైవాన్ని, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను, ఇస్లాం ధర్మాన్ని గురించి క్షుణ్ణంగా, ప్రామాణికమైన ఆధారాల ద్వారా తెలుసుకోవటం.

రెండవది : ఈ జ్ఞానాన్ని ఆచరణలో పెట్టడం.

మూడవది : దీనిని ఇతరులకు తెలియపరచటం.

నాల్గవది : ఈ మార్గంలో ఎదురయ్యే కష్టనష్టాలను ఓపికతో సహించి నిలకడనుకనబరచటం.

ప్రశ్న : దీనికి ఆధారం ఏమిటీ?

**జవాబు :** దీనికి ఆధారం ఇది :

**(కాలం సాక్షిగా! నిస్సందేహంగా మానవుడు పెద్ద నష్టానికి లోనై ఉన్నాడు.అయితే విశ్వసించి మంచి పనులు చేసిన వారు, పరస్పరం సత్యాన్ని ప్రబోధిస్తూ ఉండేవారు, సహనస్థయిర్యాలను గురించిఒండొకరికి ఉపదేశిస్తూఉండేవారుమాత్రంనష్టంలో లేరు.)**

**(అల్ అస్ర్ సూరా)**

ప్రశ్న: ఈ సూరా గురించి ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ఏమన్నారో తెలుసా?

**జవాబు :** అవును. అల్లాహ్ తన సృష్టితాల కోసం ఈ చిన్న సూరా నొక్కదానిని అవతరింప జేసినా వారి మార్గదర్శకత్వం కొరకు ఇది సరిపోయేదని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు.

ప్రశ్న : ముందు జ్ఞానమా లేక ఆచరణా?

**జవాబు :** జ్ఞానం తరువాతనే మాటలయినా,చేతలయినా.దీనికి ఆధారం ఏమిటంటే-

**"కనుక ఓ ప్రవక్తా! బాగా తెలుసుకో! అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైనవాడు ఎవడూ లేడని. నీవల్ల జరిగిన పొరపాట్లకు క్షమాభిక్ష వేడుకో. విశ్వాసులైన స్త్రీ పురుషుల పొరపాట్లకు కూడా." (ముహమ్మద్ - 19)**

ప్రశ్న : ప్రతి ఒక్కరూ తెలుసుకుని తప్పనిసరిగా ఆచరించవలసిన ఆ మూడు

ముఖ్యాంశాలు ఏవి?

**జవాబు** :: మొదటిదేమంటే; మనల్ని అల్లాహ్‌యే పుట్టించాడు. ఆయనే మన జీవికకోసం ఉపాధిని ప్రసాదించాడు. ఆయన మనల్ని ఇట్టే వదలిపెట్టలేదు. మనకు సన్మార్గం చూపడానికని ప్రవక్తల్ని పంపించాడు. ఎవరయితే వారు చెప్పినట్లు వింటాడో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు. మరెవరయితే ధిక్కరిస్తాడో అతను నరకానికి ఆహుతి అవుతాడు.

ప్రశ్న : దీనికి ఆధారం ఏమిటీ?

**జవాబు** : దీనికి ఆధారం ఇది : అల్లాహ్ తన గ్రంథంలో ఏమని సెలవిచ్చాడంటే- **"మేము ఫిర్‌ఔను వద్దకు ఒక ప్రవక్తను పంపిన విధంగా ఒక ప్రవక్తను మీపై సాక్షిగా నియమించి మీ వద్దకు పంపాము. (చూడండి) ఫిరౌను ఆ ప్రవక్త మాటను వినకపోవటం వల్ల మేము అతన్ని చాలా తీవ్రంగా పట్టుకున్నాము." (అల్ ముజ్జమ్మిల్ : 15, 16)**

రెండవదేమిటంటే; ఆరాధన మరియు దాస్యం విషయంలో తనతోపాటు మరెవరి కయినా భాగస్వామ్యం కల్పిస్తే, దీనిని అల్లాహ్ సుతరామూ సహించడు. ఇది షిర్క్ అవుతుంది. షిర్క్ చేసేవారు తనకెంత సన్నిహితులయినా, ఆఖరికి దైవదూతలు, దైవప్రవక్తలు ఈ పని చేసినా సరే దేవుడు క్షమించడు.

ప్రశ్న : దీనికి ఆధారం ఏమిటీ?

**జవాబు** : దీనికి ఆధారంగా దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వచనాన్ని చూడండి - **"మస్జిద్‌లు అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకం. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు మరొకరిని పిలవకండి."(జిన్ - 18)**

మూడవదేమిటంటే; దేవుని ఏకత్వాన్ని అంగీకరించి, దైవప్రవక్త - (సల్లల్లాహు అలైహి వ సల్లం)-కి విధేయుడై ఉంటానని ఒప్పుకున్న మీదట దైవం మరియు దైవప్రవక్తల విరోధులతో స్నేహం చేయరాదు. మరి ఆ దైవవిరోధులు తమకు ఆప్తులు, మిత్రులయినాసరే వారితో తెగతెంపులు చేసుకోవలసిందే.

ప్రశ్న : ఆ మేరకు ఏదైనా నిదర్శనం ఉందా?

**జవాబు** : ఉంది. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిస్తున్నాడు - **"అల్లాహ్‌ను, పరలోకాన్ని విశ్వసించేవారు, అల్లాహ్‌ను ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించే వారిని ప్రేమించటాన్ని నీవు ఎన్నడూ చూడ లేవు. ఆ వ్యతిరేకించేవారు వారి తల్లిదండ్రు లైనా, వారి సోదరులైనా సరే లేదా వారి కుటుంబీకులయినా సరే. వారి హృదయా లలో అల్లాహ్ విశ్వాసాన్ని స్థిరంగా నాటాడు. తన తరపు నుండి ఒక ఆత్మను ప్రసాదించి వారికి బలాన్ని ఇచ్చాడు." (ముజాదల - 22)**

ప్రశ్న : 'హనీఫియత్' - లేదా మిల్లతె ఇబ్రాహీం అంటే ఏమిటి?

**జవాబు:** మిల్లతె ఇబ్రాహీం అంటే చిత్తశుద్ధితో, ఏకాగ్ర చిత్తంతో ఒక్కడైన అల్లాహ్‌ను ఆరాధించటం. అల్లాహ్ అందరికీ దీని గురించే ఆజ్ఞాపించాడు. ఇందు నిమిత్తమే అందరినీ పుట్టించాడు.

ప్రశ్న : అలా అని ఎక్కడుందీ?

**జవాబు :** దివ్య గ్రంథమైన ఖుర్‌ఆన్‌లో ఉంది :

**“నేను జిన్నుల్నీ, మానవుల్నీ నా దాస్యం చేయడానికి మాత్రమే పుట్టించాను”.**

ప్రశ్న : ‘యాబుదూని’ (నా దాస్యమే చేయాలి) అనే మాటలోని ఆంతర్యం ఏమిటీ?

**జవాబు :** దీని ఆంతర్యం ఏమిటంటే ప్రాణులన్నీ ఆయన ఏకత్వాన్ని అంగీకరించి ఆయన ముందరే తలవంచాలి. ఆయన చేయమన్న దానిని చేయాలి. వద్దన్న దానికి దూరంగా ఉండాలి.

ప్రశ్న : అల్లాహ్ ఆజ్ఞాపించిన వాటిలోకెల్లా పెద్ద ఆజ్ఞ ఏది?

**జవాబు :** తౌహీద్ ! అదే ఏకదైవారాధన.

ప్రశ్న : ‘తౌహీద్’ అంటే ఏమిటీ?

**జవాబు :** తౌహీద్ అంటే కేవలం ఒక్క అల్లాహ్‌నే పూజించాలి. ఆయన దైవత్వంలో, ఆయన గుణగణాలలో, ఆయన అధికారాలలో వేరొకరికి సహవర్తుల్ని కల్పించ కూడదు. ఆయన అద్వితీయుడనీ, దోషరహితుడనీ, రాగద్వేషాలకు అతీతుడనీ, సృష్టితాలలో ఆయనకు ఏమాత్రం పోలికలేదనీ అంగీకరించాలి. ఇదే స్వచ్ఛమైన తౌహీద్.

ప్రశ్న : అల్లాహ్ మనల్ని వారించిన వాటిలోకెల్లా పెద్ద వస్తువు ఏది?

**జవాబు :** షిర్క్.

ప్రశ్న : షిర్క్ అంటే?

**జవాబు :** షిర్క్ అంటే అల్లాహ్‌తో పాటు వేరొక దైవేతరుణ్ణి మొర పెట్టుకోవటం, దైవారాధనలో ఇంకొకరికి సాటి కల్పించటం.

ప్రశ్న : దీనికి ఉపమానం గానీ, ఆధారం గానీ ఉందా?

**జవాబు :** ఉంది. ఉదాహరణకు దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది ఆయత్‌ని గమనించండి:

**1. “మీరంతా అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయ వద్దు.” (అన్ నిసా - 36)**

**2. “ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి.” (అల్ బఖర - 22)**

ప్రశ్న : ప్రతి ఒక్కరూ అవశ్యంగా తెలుసుకోవలసిన మూడు ముఖ్య సూత్రా

లేమిటి?
**జవాబు :** 1. తమ పోషకుని (రబ్) తెలుసుకోవటం, 2. తన నిజధర్మమైన ఇస్లాంను తెలుసుకోవటం, 3. తన ప్రవక్తయగు హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తెలుసుకోవటం.
ప్రశ్న : నీ ప్రభువు (పోషకుడు) ఎవరు?
**జవాబు :** నా ప్రభువు అల్లాహ్. ఆయనే నన్నూ మరియు సమస్తలోక వాసులను తన అనుగ్రహంతో పోషిస్తున్నాడు. ఆయనే నా ఆరాధ్య దైవం. ఆయన తప్ప నాకు మరో ఆరాధ్యుడు లేడు.
ప్రశ్న : దీనికి నిదర్శనం ఏమిటి?
**జవాబు :** దివ్య ఖుర్ఆన్‌లోని తొలి వాక్యమే దీనికి నిదర్శనం -
**"ప్రశంసలు, పొగడ్తలన్నీసర్వలోకాలపాలకుడు, పోషకుడుఅయినఅల్లాహ్‌కేశోభి స్తాయి."**
అల్లాహ్ తప్ప మిగిలినదంతా లోకంగా పరిగణించడుతుంది. నేను కూడా ఈ లోకంలో ఒక వ్యక్తిని.
ప్రశ్న : నీవు నీ ప్రభువును ఎలా తెలుసుకోగలిగావు?
**జవాబు :** నేను నా ప్రభువును ఆయన నిదర్శనాల ద్వారా తెలుసుకోగలిగాను. ఆయన సృష్టితాల ద్వారా, రేయింబవళ్ల ద్వారా, సూర్యచంద్రుల ద్వారా, భూమ్యా కాశాల ద్వారా, అందలి ప్రాణుల ద్వారా భూమ్యాకాశాలలో సంచరించే జీవుల ద్వారా తెలుసుకోగలిగాను.
ప్రశ్న : దీనికి నిదర్శనం ఏమిటీ?
**"ఈ రేయింబవళ్లూ, ఈ సూర్య చంద్రులు అల్లాహ్ సూచనలలోనివే. సూర్యచంద్రులకు సాష్టాంగ పడకండి. వాటిని సృజించిన దేవు నికి సాష్టాంగ పడండి - నిజంగానే మీరు ఆయనను ఆరాధించేవారే అయితే." (హామీమ్ అస్ సజ్దా - 37)**
**"వాస్తవంగా మీ ప్రభువు అల్లాహ్‌యే. ఆయన ఆకాశాలనూ, భూమినీ ఆరు దినాలలో సృష్టించాడు. తరువాత తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు. రాత్రిని పగటిపై కప్పి వేస్తాడు. ఆ తరువాత పగలు రాత్రి వెంట పరుగులు తీస్తూ ఉంటుంది. ఇంకా ఆయన సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, నక్షత్రాలను పుట్టించాడు. అన్నీ ఆయన ఆజ్ఞకు కట్టు బడి ఉన్నాయి. తెలుసుకోండి! సృష్టి ఆయ నదే. దానిపై ఆధిపత్యమూ ఆయనదే. అల్లాహ్ అనంతమయిన శుభాలు కలవాడు. సకల లోకాలకు ప్రభువు, (అల్ ఆరాఫ్ - 54)**
ప్రశ్న : 'రబ్' అని ఎవరిని అంటారు?
**జవాబు :** యజమాని, స్వామి మరియు శూన్యంలో నుంచి అస్థిత్వాన్ని తీసుకువచ్చే వానిని 'రబ్' అని అంటారు.అటువంటి శక్తిమంతుడే యదార్థానికి పూజనీ యుడు.
ప్రశ్న : ఈ మేరకు ఏదన్నా నిదర్శనం ఉందా?

**జవాబు :** ఉంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యాన్ని పరిశీలించండి -

**"మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీనిద్వారానే మిమ్మల్ని మీరు రక్షిం చుకునే అవకాశం ఉంది. మీ కొరకు భూమిని పాన్పు గాను, ఆకాశాన్ని కప్పు గానూ సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురి పించి తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసినవాడూ ఆయనే. ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకండి." (అల్ బఖర - 21, 22)**

అందుచేతఈవస్తువులను ఎవరు సృష్టించాడో అతడే ఆరాధనలు,దాస్యానికి అర్హుడు.

ప్రశ్న : 'ఇబాదత్' అని దేనినంటారు?

**జవాబు :** ఆరాధ్యుని సమక్షంలో అశక్తతతో, అణకువతో, వినమ్రతతో, ప్రేమాతిశయంతో మెలగటాన్ని 'ఇబాదత్' అని అంటారు. వేరే మాటల్లో చెప్పాలంటే దాసుడు దేవుని ప్రసన్నతను చూరగొనడానికి, ఆయన్ని సంతృప్తిపరచడానికి చేసే ఇబాదత్ లేక ఆరాధన.

ప్రశ్న : అల్లాహ్ ఎన్ని రకాల ఆరాధనలు చేయమని ఆజ్ఞాపించాడు?

**జవాబు :** ఎన్నో రకాల ఆరాధనలు చేయమన్నాడు. వాటిలో ఇస్లాం, ఈమాన్, ఇహ్సాన్, దుఆ, భయము, దైవాన్ని కలుసుకోవాలన్న కుతూహలం, కఠోర పరిశ్రమ, అభ్యాసం, ఆశ, అణకువ, దైవంపై భారం మోపటం, ఖుర్బానీ,ఉపవాసం, మొక్కుబడి లాంటివే గాకుండా ఇంకా అనేక ఆరాధనలున్నాయి. వాటిని చేయమని అల్లాహ్ ఆదేశించాడు. మరి ఇవన్నీ అల్లాహ్‌కే ప్రత్యేకం అన్న సంగతిని మరువరాదు.

ప్రశ్న : దీనికి ఆధారం ఏమిటీ?

**జవాబు :** దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వచనం గమనించండి.

**"మస్జిద్‌లు అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకం. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు మరొకరిని వేడుకొనరాదు." (సూరె జిన్-18)**

**ఇంకా ఇలా అనబడింది :**

**"నీ ప్రభువు నిర్ణయం చేసేశాడు - మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి." (బనీ ఇస్రాయీల్ - 23)**

ప్రశ్న : ఎవరయినా వీటిలో దేనిననయినా దైవేతరుల కోసం ప్రత్యేకించినట్లయితే ఏమవుతుంది?

**జవాబు :** ఎవరయినా వీటిలో దేనినయినా దైవేతరుల కొరకు ప్రత్యేకిస్తే వారు ముష్రిక్‌లు (బహు దైవోపాసకులు) అయిపోతారు.

ప్రశ్న : ఏమిటీ దీనికీ ఆధారం?

**జవాబు :** దీనికి ఆధారంగా అల్లాహ్ ఈవిధంగా సెలవిచ్చాడు -

**"ఎవడయినా అల్లాహ్‌తోపాటు మరొక ఆరా ధ్యుణ్ణి కూడా వేడుకుంటే, దానికి అతని వద్ద ఏ ప్రమాణమూ లేదు.అతని లెక్క అతని ప్రభువు వద్దఉన్నది. అటువంటి అవిశ్వాసులు ఎన్నటికీ సాఫల్యం పొంద లేరు." (అల్ మూమినూన్ - 117)**

ప్రశ్న : దుఆ (వేడుకోలు)కూడా ఆరాధనే (దాస్యమే) నన్నదానికి ఏమిటీ నిదర్శనం?

**జవాబు :** అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఈవిధంగా సెలవిచ్చి ఉన్నాడు -

**"మీ ప్రభువు స్పష్టంగా చెప్పేశాడు : మీరు నన్ను పిలవండి. నేనుమీ మొరను వింటాను మరియు ఆమోదిస్తాను. ఎవరయితే నా ఆరాధన యెడల తలబిరుసు తనం ప్రదర్శిస్తారో వారు త్వరలోనే పరాభవంపాలై నరకంలో ప్రవేశిస్తారు." (....)**

ఇదిలా వుండగా "అద్దుఆవు ముఖ్ఖుల్ ఇబాద" (ఈ హదీస్ జయీఫ్‌ఉన్నది.) (దుఆ ఆరాధన యొక్క సారం) అని మహనీయ ముహమ్మదు (సఅసం) వారు ప్రబోధించారు. వేరొక సహీ హదీసులో 'అద్దుఆవు హువల్ ఇబాద' (దుఆయే అసలు ఆరాధన) అని ఉంది

ప్రశ్న : ఖౌఫ్ (భయము, భీతి) కూడా ఆరాధనే నన్నదానికి నిదర్శనం ఏమిటీ?

**జవాబు :** దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వచనమే దీనికి నిదర్శనం -

**"కనుక మీరు నిజమయిన విశ్వాసులే అయితే ఇక ముందు మానవులకు భయ పడకండి. నాకు భయపడండి." (ఆలి ఇమ్రాన్ - 175)**

ప్రశ్న : 'రిజా' (దైవాన్ని కలుసుకునే కుతూహలం) కూడా ఆరాధనే అన్న దానికి నిదర్శనం ఏమిటీ?

**జవాబు :** దివ్య ఖుర్‌ఆన్‌లోని క్రింది వచనమే దీనికి నిదర్శనం -

**"కనుక తన ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడు సత్కార్యాలు చేయాలి. ఆరాధ నలో తన ప్రభువుతోపాటు మరెవ్వరినీ చేర్చకూడదు." (అల్ కహఫ్ - 110)**

ప్రశ్న : 'తవక్కుల్' (దైవంపై గల నమ్మకం, దైవంపై భారం వేయటం) కూడా ఆరాధనేనన్న దానికి రుజువు ఏమిటీ?

**జవాబు :** దీనికి రుజువు ఇది-

**1. "మీరు నిజంగానే విశ్వాసులయితే అల్లాహ్‌పై భారం వెయ్యండి." (అల్ మాయిద - 23)**

**2. "ఎవరయితేఅల్లాహ్‌పైభారం వేస్తాడో అతని కొరకు ఆయన చాలు." (తలాక్- 5)**

ప్రశ్న : కఠోర పరిశ్రమ, అభ్యాసం, ఆశ, అణకువ వంటివి కూడా ఆరాధనే నన్న దానికి ఆధారం ఏమిటీ?

**జవాబు :** దీనికి ఆధారం ఇదే -

**"వారు సత్కార్యాల కోసం ఎంతగానో ప్రయాస పడతారు.ఆశతోనూ,శ్రద్ధాభక్తుల తోనూ మమ్మల్ని ప్రార్థిస్తారు. మా సమ క్షంలో అణగిమణగి ఉంటారు."అంబియా - 90)**

ప్రశ్న : 'ఖషియత్' (భయము, భక్తి) కూడా ఆరాధనే అనే దానికి ఆధారంఏమిటీ?

**జవాబు :** దీనికి ఆధారం దివ్య గ్రంథంలోని ఈ క్రింది వచనం. ఇందులో అల్లాహ్ తన దాసులను ఉద్దేశ్యించి ఏమంటున్నాడో చూడండి -

**"కనుక మీరు వారికి భయపడకండి. నాకు భయపడండి." (అల్ మాయిద - 3)**

ప్రశ్న : 'ఇనాబత్' (మరలటం,రుజువు కావటం) కూడా ఆరాధనే అన్న దానికి నిదర్శనం ఏమిటీ?

**జవాబు :** దివ్య ఖుర్ఆన్‌లోని ఈ క్రింది వచనం దీనికి నిదర్శనం -

**"మీ మీదకు శిక్ష రాకముందే, మీకు ఎవరినుండీ సహాయంలభించని పరిస్థితి ఏర్పడక ముందేమీరు మీ ప్రభువు వైపునకు మరలి, ఆయనకు విధేయత చూపండి." (అజ్ జుమర్ - 54)**

ప్రశ్న : 'ఇస్తైఆనత్' (సహాయం అర్థించటం) కూడా ఆరాధనే అనడానికి ఆధారం ఏమిటీ?

**జవాబు :** దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ప్రార్థనే దీనికి నిదర్శనం :

**"(దేవా!) మేము నిన్నే ఆరాధిస్తున్నాము. సహాయం కొరకు నిన్నే అర్థిస్తున్నాము." (అల్ ఫాతిహా - 4)**

ఇంకా - హదీసులో ఇలా ఉంది :

**"నువ్వు ఏదైనా అర్థించటమే జరిగితే అల్లాహ్‌ను అర్థించు."**

ప్రశ్న : 'ఇస్తైఆజ' (శరణు కోరటం) కూడా ఆరాధనే ననడానికి ఆధారం ఏమిటీ?

**జవాబు :** 'ఇస్తైఆజ' కూడా ఆరాధనే అనడానికి ఆధారం ఇది :

**ఇలా అను,"నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్యదైవం (అయిన అల్లాహ్) శరణు కోరుతున్నాను."**

ప్రశ్న : 'ఇస్తైగాస' (ఫిర్యాదు లేక విన్నపం చేసుకోవటం) కూడా అరాధనే అనడానికి ఏమిటీ నిదర్శనం?

**జవాబు :** దివ్య ఖుర్ఆన్‌లోని ఈ క్రింది వచనమే దీనికి నిదర్శనం -

**"ఇంకా మీరు మీ ప్రభువును సహాయం కొరకు విన్నవించుకున్న సందర్భాన్ని కూడా జ్ఞప్తికి తెచ్చుకోండి. సమాధానంగా అప్పుడు ఆయన ఇలా సెలవిచ్చాడు : 'నేను మీ సహాయం కొరకు వెయ్యిమంది దైవదూతలను ఒకరి తరువాత ఒకరిని ఎడతెగకుండా పంపుతున్నాను." (అన్ ఫాల్ - 9)**

ప్రశ్న : ఒకరి పేరుమీద జిబహ్ చేయటం (బలి ఇవ్వటం) కూడా ఆరాధనే అన్న దానికి ఏమిటి ఆధారం?

**జవాబు :** దేవుని ఈ ఉపదేశమే దీనికి ఆధారం :

**"(ఓ ప్రవక్తా!) ఇలా ప్రకటించు : నా నమాజ్, నా సకల ఉపాసనా రీతులు, నా జీవనం, నా మరణం-సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయన కు ఏ భాగ స్వామీ లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వ బడింది. అందరికంటే ముందు**

**విధేయ తతో తలవంచే వాణ్ణి నేనే." (అల్ అన్ ఆమ్ - 162)**
ప్రశ్న : మొక్కుకోవటం కూడా ఆరాధనేనన్నదానికి ఆధారమేమిటి?
**జవాబు** : దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఉపదేశమే దీనికి ఆధారం-
**"వారు ఎలాంటి వారంటే (ప్రపంచంలో) మొక్కుబడి చెల్లించేవారు,నలువైపుల నుంచీ ఆపదలు కమ్ముకుని వచ్చే దినానికి భయపడేవారు."(అద్ దహ్ర్ - 7)**
ప్రశ్న : రెండవ ప్రధానాంశం ఏమిటీ?
**జవాబు** : ఇస్లాం ధర్మాన్ని ఆధారాలతో సహా తెలుసుకోవటం.
ప్రశ్న : ఇస్లాం అంటే ఏమిటీ?
**జవాబు** : ఇస్లాం అంటే స్వచ్ఛమైన ఏక దైవారాధనతోపాటు, బేషరతుగా అల్లాహ్‌కు లొంగిపోవటం, పూర్తిగా సమర్పించుకోవటం,దైవాజ్ఞాపాలన చేయటం, ఆయనకు విధేయత చూపటం, బహు దైవారాధనతో, బహు దైవారాధకులతో తెగతెంపులు చేసుకోవటం.
ప్రశ్న : ఇస్లాం ధర్మంలో గల అంతస్థులు ఎన్ని? అవి ఏవి?
**జవాబు** : ఈ అంతస్థులు మూడు. 1. ఇస్లాం 2. ఈమాన్ 3. ఇహ్సాన్. ప్రతి అంతస్థు లేక స్థాయిలో కొన్ని ప్రధానాంశాలు ఉన్నాయి.
ప్రశ్న : ఇస్లాంలోని ప్రధానాంశాలు - మౌలికాంశాలు - ఎన్ని?
**జవాబు** : ఐదు.

1. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదైవం లేడనీ, ముహమ్మద్ - (సల్లల్లాహు అలైహి వ సల్లం) దైవప్రవక్తయనీ సాక్ష్యమివ్వడం.
2. నమాజ్‌ను నెలకొల్పటం.
3. జకాత్ అనే విధిగా చెల్లించవలసిన దానాన్ని చెల్లించటం.
4. రమజాన్ నెలలో విధిగా ఉపవాసాలుండటం.
5. (స్థోమత ఉంటే) హజ్ చేయటం.

ప్రశ్న : అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడన్న సాక్ష్యానికి నిదర్శనం ఏమిటీ?
**జవాబు** : దివ్య గ్రంథమైన ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :
**"తాను తప్ప మరొక దైవం లేడు అనే సత్యానికి స్వయంగా అల్లాహ్‌యే సాక్ష్యమిచ్చాడు. దైవదూతలు, సమస్త జ్ఞానులు కూడా ఆ మహాశక్తిమంతుడూ, ఆ మహాజ్ఞానీ తప్ప వాస్తవానికి మరొక దైవం లేడు అని నిజా యితీగానూ, న్యాయంగానూ సాక్ష్యమిస్తారు."**
**(ఆలి ఇమ్రాన్ - 18)**
ప్రశ్న : "లా ఇలాహ ఇల్లల్లాహ్" అంటే భావం ఏమిటీ?
**జవాబు** : అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు, పూజ్యుడు లేడనీ, ఆయనే నిజ దైవ మనీ భావం.
ప్రశ్న : "లా ఇలాహ్" అంటే....?
**జవాబు** : అల్లాహ్ తప్ప ఇతర దైవాలను వదలి వేయటం, త్రోసిపుచ్చటం అని భావం.
ప్రశ్న : "ఇల్లల్లాహ్" అంటే భావం ఏమిటీ?

**జవాబు :** ఆరాధన, దాస్యం, పూజలకు అల్లాహ్‌యే తగినవాడనీ, దాస్యంలో ఆయనకు సహవర్తులు ఎవరూ లేరని ఆచరణ ద్వారా రుజువు చేయటం.

ప్రశ్న : ఈ విషయాన్ని విడమరచి చెప్పేదేమైనా ఉందా?

**జవాబు :** అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు-

**"ఇబ్రాహీమ్ తన తండ్రికీ, తన జాతివారికీ ఇలా చెప్పిన ఆ సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో, 'మీరు పూజిస్తున్న వాటితో నాకు ఏ సంబంధమూ లేదు. నా సంబంధం కేవలం నన్ను సృష్టించిన వానితోనే ఉన్నది. ఆయనే నాకు మార్గం చూపుతాడు.' ఇబ్రా హీమ్ ఈ వచనాన్నే తన తరువాత తన సంతానం కోసం విడిచివెళ్లాడు, వారు దాని వైపునకు మరలేందుకు." (అజ్ జుఖ్‌రుఫ్ : 26-28)**

మరోచోట ఇలా సెలవిచ్చాడు

**"ప్రవక్తా! ఇలా చెప్పు : "గ్రంథం కల ప్రజ లారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమి టంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాము లుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది."ఈ సందే శాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే వారితో స్పష్టంగా ఇలా అను:"మేము ముస్లింలము (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారు, విధేయత చూపేవారు) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి." (ఆలి ఇమ్రాన్ - 64)**

ప్రశ్న : ముహమ్మద్-సల్లల్లాహు అలైహి వ సల్లం-దైవప్రవక్త అన్నసాక్ష్యానికి ఆధారం ఏమిటీ?

**జవాబు :** దివ్య ఖుర్ఆన్‌లోని ఈ దైవోపదేశమే ఇందుకు ఆధారం-

**"చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు తీవ్రంగా నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫ ల్యాన్నిఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు." (అత్ తౌబా - 128)**

అల్లాహ్ ఇంకా ఈ విధంగా స్పష్టం చేశాడు -

**"ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త. ఆయనవెంట ఉన్నవారు అవిశ్వాసుల పట్ల కఠినులు గానూ ఉంటారు,పరస్పరం కరుణామయులు గానూ ఉంటారు."**(అల్ ఫతహ్ - 29)

ప్రశ్న : ముహమ్మద్ - సఅసం-దైవప్రవక్త (రసూలుల్లాహ్) అని సాక్ష్యమివ్వ డంలోని మతలబు ఏమిటీ?

**జవాబు :** దీని మతలబు ఏమిటంటే; ఆయన ఆదేశాలను పాలించాలి, ఆయన ఏ విషయం చెప్పినా దాన్ని సత్యమని ధృవీకరించాలి. ఆయన వారించిన వాటికి దూరంగా ఉండాలి. ఆయన చూపిన షరీయత్ కనుగుణంగా దైవారాధన చేయాలి.

ప్రశ్న: నమాజ్, రోజా గురించి ఏం ఆధారముంది? తౌహీద్‌కు గల తాత్పర్యం ఏమిటీ?

**జవాబు :** అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చి ఉన్నాడు :
**"వారు అల్లాహ్‌కు దాస్యం చెయ్యాలని, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్నిఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని, నమాజ్‌ను స్థాపిం చాలనీ, జకాత్ ఇస్తూ ఉండాలని మాత్రమే వారికి (గ్రంథ వహులకు) ఆదేశించటం జరిగింది. ఇదే సరియైన, సవ్యమైన ధర్మం (అని వారికి స్పష్టం చేయబడింది). (అల్ బయ్యిన - 5)**
ప్రశ్న : 'రోజా' (ఉపవాసం)కు ఆధారమేమన్నా ఉందా?
**జవాబు :** ఉంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వచనం చదవండి :
**"విశ్వసించిన ఓ ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది -ఏ విధం గా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించే వారికి కూడా విధించబడిందో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది." (అల్ బఖర : 183)**
ప్రశ్న : హజ్ చేయాలి అన్న దానికి ఆధారం ఏమిటీ?
**జవాబు :** దివ్య ఖుర్‌ఆన్‌లో హజ్ గురించి ఇలా సెలవీయబడింది :
**"ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమి టంటే, ఈ గృహానికి వెళ్ళే శక్తి గలవారు దాని హజ్‌ను విధిగా చేయాలి. ఈ ఆజ్ఞను పాలించడానికితిరస్కరించేవాడు, అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంత మాత్రం లేదు అని స్పష్టంగా తెలుసు కోవాలి." (ఆలి ఇమ్రాన్ - 97)**

ప్రశ్న : ఇస్లాం ధర్మం యొక్క రెండవ అంతస్థు ఏది?
**జవాబు :** ఈమాన్ (విశ్వాసం).
ప్రశ్న : ఈమాన్ శాఖలు (విభాగాలు) ఎన్ని?
**జవాబు :** ఈమాన్ శాఖలు డెబ్బయికి పైగా ఉన్నాయి. వాటిలో అన్నిటికన్నా ఉన్నతమైనది 'లా ఇలాహ ఇల్లల్లాహ్'. అన్నిటికన్నా తక్కువ స్థాయిగల శాఖ 'దారిలో పడి ఉన్న బాధాకరమైన వస్తువులను తొలగించటం.' లజ్జ మరియు వ్రీడ కూడా ఈమాన్‌లో అంతర్భాగమే.
ప్రశ్న : ఈమాన్‌లోని ప్రధానాంశాలు ఎన్ని? అవి ఏవి?
**జవాబు :** ఈమాన్‌లోని ప్రధానాంశాలు ఆరు. అవి 1. అల్లాహ్‌పై విశ్వాసం 2. దైవదూతలపై విశ్వాసం 3. దైవం తరఫున అవతరింపజేయబడిన గ్రంథాలపై విశ్వాసం 4. దైవప్రవక్తలపై విశ్వాసం 5. అంతిమ దినంపై విశ్వాసం 6. మంచి జరిగినా, చెడు జరిగినా-అంతా దైవం తరఫుననే జరుగుతుంది అనే దాని (విధి వ్రాత)పై విశ్వాసం.
ప్రశ్న : ఏమిటీ దీనికి ఆధారం?
**జవాబు :** ఆధారం కావాలంటే దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వచనాన్ని చదవండి.
**"సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో, పడమరకో త్రిప్పటం కాదు, సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ, దూతలనూ, అల్లాహ్**

**అవతరింపజేసిన గ్రంథాన్నీ,ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించటం."**
**(అల్ బఖర : 127)**

ప్రశ్న : 'విధి' (తక్‌దీర్) అనే దానికి ఆధారం ఏమిటీ?

**జవాబు :** దీనికి ఆధారం దివ్య గ్రంథంలోని ఈ వచనం -
**"మేము ప్రతి వస్తువునూ ఒక విధి నిర్ణయం తోపాటు సృష్టించాము."** **(అల్ ఖమర్ - 49)**

ప్రశ్న : ఇస్లాం ధర్మం యొక్క మూడవ అంతస్థు ఏది?

**జవాబు :** ఇస్లాం మూడవ అంతస్థు 'ఇహ్సాన్.'

ప్రశ్న : 'ఇహ్సాన్' అంటే అసలేమిటీ?

**జవాబు :** మీరు అల్లాహ్‌ను చూస్తున్నామన్న భావనతో ఆరాధన చేయండి. లేకుంటే, ఆయన మిమ్మల్నిచూస్తున్నాడన్న తలంపుతోనయినా ఆరాధన చేయండి. అంటే ఏ ఆరాధననైనా ఉత్తమ రీతిలో నిర్వర్తించటమే అసలు ఇహ్సాన్ అన్నమాట.

ప్రశ్న: దీనికి ఆధారం ఏమిటి?

**జవాబు :** దివ్య ఖుర్ఆన్‌లోని క్రింది ఆయతే దీనికి ఆధారం.
**"భయభక్తులతో పనిచేస్తూ, ఉదాత్త వైఖరి కలిగి ఉండే వారితో అల్లాహ్ ఉంటాడు."**
**(అన్ నహ్లో-128)**

మరో చోట అల్లాహ్ ఈ విధంగా ప్రబోధించాడు -
**"మహా శక్తిమంతుడైన ఆ అనంతకరుణా మయుడిపై భారం మోపు. ఆయన నిన్ను, (నీవు) లేచినపుడు చూస్తాడు, సజ్దా చేసేవారిలో నీ రాకపోకలను గమనిస్తాడు. ఆయన అన్నీ వింటాడు, అన్నీ తెలిసిన వాడు."(అష్ షుఅరా: 217-220)**

వేరొక చోట ఇలా సెలవీయబడింది-
**"ప్రవక్తా! నీవు ఏ స్థితిలో ఉన్నా,ఖురాను నుండి దేనిని వినిపించినా, మానవులారా! మీరుఏది చేసినా ఆ అన్ని సందర్భాల లోనూ మేము మిమ్మల్నిచూస్తూనే ఉంటాము"**
**(యూనుస్-61)**

ప్రశ్న: ఇస్లాం ధర్మానికి చెందిన ఈ మూడు మెట్లకు (ఇస్లాం, ఈమాన్ ఇహ్సాన్)కి సంబంధించి హదీసు లేక సున్నతులో కూడా ఏమైనా ఆధారముందా?

**జవాబు :** ఉంది. హదీసె జిబ్రయీల్‌గా ఖ్యాతి చెందిన ఆ హదీసును హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఈ విధంగా తెలిపారు- ''మేము దైవప్రవక్త - సల్లల్లాహు అలైహి వ సల్లం - సమక్షంలో కూర్చుని ఉన్నాము. అంతలో ఒక వ్యక్తి వచ్చాడు. అతని దుస్తులు ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయి. జుట్టు నల్లగా ఉంది. మరి అతనిలో ప్రయాణ బడలిక కూడా కనిపించలేదు. మాలో ఎవరూ అతన్ని ఎరుగరు. ఆ వ్యక్తి దైవప్రవక్త (సఅసం)ఎదుటకూర్చున్నాడు.తన మోకాళ్లను ఆయన మోకాళ్లకు ఆనించి మరీ కూర్చున్నాడు. తన అరచేతులను ఆయన తొడలపై ఉంచి, 'ఓ ముహమ్మద్! నాకు ఇస్లాం గురించి తెలియజేయండి' అని అన్నాడు. 'నీవు అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదని సాక్ష్యమివ్వాలి.ముహమ్మద్

అల్లాహ్ సందేశహరుడని కూడా నీవు సాక్ష్యమివ్వాలి.నమాజ్‌ను స్థాపించాలి. జకాత్ ఇవ్వాలి.రమజాన్ నెలలో ఉపవాసాలుండాలి. స్థోమత ఉంటే దైవ గృహాన్ని సందర్శించి హజ్ చేయాలి' అని ఆయన (సఅసం)వివరించారు.'తమరు చెప్పింది నిజం' అన్నాడా వ్యక్తి.మాకు ఆశ్చర్యం కలిగించింది అతని ప్రవర్తన. ప్రశ్నించేవాడూ అతనే, సమాధానాన్ని సత్యమని ధృవీకరించేవాడూ అతనే. 'నాకు ఈమాన్ గురించి వివరించండి' అని తిరిగి ప్రశ్నించాడా పృచ్ఛకుడు. దానికాయన (స), 'నీవు అల్లాహ్‌ను,ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, అంతిమ దినాన్ని, మంచి జరిగినా చెడు జరిగినా అంతా దైవం తరఫుననే జరుగుతుందన్న విధివ్రాతను విశ్వసించు.ఇదే ఈమాన్' అని వివరించారు. 'నాకు ఇహ్సాన్ గురించి చెప్పండి' అని మళ్లీ ప్రశ్నించాడా అపరిచితుడు. ఆయన (సఅసం) ఇలా విడమరచి చెప్పారు: 'నీవు అల్లాహ్‌ను చూస్తున్నానన్న (అల్లాహ్ ఎదుట ఉన్నాడన్న) భావంతో ఆయన్ని ఆరాధించు.ఒకవేళ నీవు ఆయన్ని చూడ లేకపోయినా, ఆయన నిన్ను చూస్తున్నాడన్న తలంపు నీలో ఉండాలి.'' 'నాకు ప్రళయదినం గురించి చెప్పండి' అని అడిగాడు ఆ అపరిచిత వ్యక్తి.'దాని గురించి ప్రశ్నించబడే వానికి ప్రశ్నించేవానికన్నా ఎక్కువేమీ తెలీదు' అన్నారాయన (స). 'పోనీ నాకు దాని సూచనలయినా తెలుపగలరా?!' అని ఇంకో ప్రశ్న వేశాడు అతను. దానికాయన ఇలా చెప్పారు: 'దాసీ (బానిసరాలు, పని మనిషి) తన యజమానురాలికి జన్మనిస్తుంది. కాళ్లకు చెప్పులు, శరీరంపై చొక్కా లేకుండానే గొర్రెల్ని కాచే గొర్రెల కాపరులు బ్రహ్మాండమైన కట్టడాలు కట్టడం నీవు చూస్తావు'. మరి ఆ వ్యక్తి అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. మేము కాస్సేపు మౌనం వహించాము. తరువాత ఆయన (సఅసం) 'ఓ ఉమర్! ప్రశ్నలు వేసిన వ్యక్తి ఎవరో మీకు తెలుసా?!'అని అడిగారు. 'దైవానికి, దైవప్రవక్త (సఅసం)కే తెలిసి ఉండాలి' అని మేము విన్నవించుకున్నాము. 'ఆయన జిబ్రయీల్. మీకు మీ ధర్మాన్ని బోధించే నిమిత్తం ఆయన మీ వద్దకు విచ్చేశారు' అని ఆయన (సఅసం) చెప్పారు. (సహీహ్ ముస్లిం)

ప్రశ్న : మూడవ ముఖ్యాంశం ఏమిటి?

**జవాబు :** మహనీయ ముహమ్మద్ (సఅసం) గారి గురించి. ఆయన ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్.ఖురైష్‌తెగకు చెందిన వారు. ఖురైషులు అరబ్బులు. మరి ఈ అరబ్బులు దైవప్రవక్తలయిన హజ్రత్ ఇబ్రాహీమ్, హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం)ల సంతతికి చెందిన వారు.

ప్రశ్న : దైవప్రవక్త (సఅసం) వయస్సు గురించి చెబుతారా?

**జవాబు :** దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 63 సంవత్సరాలు జీవించి ఉన్నారు.40 ఏళ్ల వయస్సులో దైవప్రవక్తగా నియుక్తులయ్యారు. దైవప్రవక్తగా

23 సంవత్సరాలు మానవ జాతికి మార్గదర్శకత్వం వహించారు. సూరె 'ఇఖ్రా'తో దైవదౌత్య శుభవార్త అందింది. సూరె 'ముద్దస్సిర్' అందిన క్షణం నుంచి సందేశ కార్యానికి నడుం బిగించారు.ఆయన మక్కాలో జన్మించారు. మక్కా నుండి మదీనాకు ప్రస్థానం (హిజ్రత్) చేశారు. మదీనాలోనే ప్రభువు వద్దకు మహా ప్రస్థానం చేశారు.

ప్రశ్న : అల్లాహ్ ఆయన్ని దేని కొరకు పంపాడు?

**జవాబు :** మానవ జాతిని షిర్క్ (బహు దైవారాధన) నుండి రక్షించడానికి, ఏకేశ్వరోపాసనని బోధించడానికి అల్లాహ్ ఆయన్ని పంపాడు.

ప్రశ్న : దీనికి ఆధారం ఏమిటి?

**జవాబు :** దివ్య ఖుర్‌ఆన్‌లోని క్రింది వచనాలు దీనికి స్పష్టమైన ఆధారాలు.

**"వస్త్రం కప్పుకుని పడుకున్న మనిషీ! లే; లేచి హెచ్చరించు. నీ ప్రభువు ఘనతను చాటి చెప్పు. నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో, అశుద్ధతకు దూరంగా ఉండు. ఎక్కువగా పొందాలనే కాంక్షతో ఉపకారం చేయకు.నీ ప్రభువు కొరకు ఓర్పు వహించు."**

**(అల్ ముద్దస్సిర్ : 1 - 7)**

ప్రశ్న : "లే,లేచిహెచ్చరించు" అన్న మాటల్లోని అంతరార్థం ఏమిటి?

**జవాబు :** దీని అంతరార్థం ప్రజలకు షిర్క్ గురించి హెచ్చరించమనీ,తౌహీద్‌ను ఉపదేశించమనీను.

ప్రశ్న: "నీ ప్రభువు ఘనతను చాటిచెప్పు.నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో" అనడంలోని భావం ఏమిటి?

**జవాబు :** తౌహీద్ (ఏకేశ్వరోపాసన) ని స్వీకరించటం ద్వారా ప్రభువు గొప్పతనాన్ని అంగీకరించమనీ,ఆచరణలను షిర్క్ అనే మలినం నుండి కాపాడుకోమనీ భావం.

ప్రశ్న :"అశుద్ధతకు దూరంగా ఉండు" అనడంలోని ఔచిత్యం ఏమిటి?

**జవాబు :** విగ్రహాలను, విగ్రహారాధకులను విడిచిపెట్టేయమనీ, వాటితో తెగత్రెంపులు చేసుకోమనీ భావం.

ప్రశ్న : దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా మలినమైన వాతావరణానికి దూరంగా ఎంత కాలం ఉన్నారు?

**జవాబు :** పదిసంవత్సరాలు. ఆతరువాత మేరాజ్ యాత్ర ప్రాప్తించింది.ఆ సందర్భంగా ఐదు నమాజులు వొసగబడ్డాయి. నమాజు ద్వారా దైవ సహాయాన్ని అర్థించాలన్నది దీని అభిమతం.ఆ తరువాత ఆయన మదీనాకు వలసపోయారు (హిజ్రత్ చేశారు).

ప్రశ్న : హిజ్రత్ అంటే ఏమిటి?

**జవాబు :** హిజ్రత్ అంటే ప్రస్థానం చేయటం,ఒక చోటి నుండి మరో చోటికి వలసపోవటం! షిర్క్ వాతావరణం నుండి ఏకేశ్వరోపాసనా వాతావరణం వైపునకు, చెడులకు నిలయమైన చోటు నుండి స్వచ్ఛమయిన భావాల పరివ్యాప్తికి అనువైన చోటుకు, చెడు వ్యవస్థ నుండి సత్య ప్రధానమైన వ్యవస్థ వైపునకు తరలి వెళ్లటమే

హిజ్రత్!
ప్రశ్న : హిజ్రత్ ఆజ్ఞ ఎప్పటికీ ఉంటుందా?
**జవాబు :** ఉంటుంది.షిర్క్, బిద్అత్‌ల కాలుష్యం నుండి తౌహీద్ మరియు సున్నత్‌ల పరిశుద్ధత వైపునకు, చెడు భావాల నుండి సవ్యమైన భావాల వైపునకు, చెడు సహచర్యం నుండి సద్వర్తనుల సహచర్యం వైపునకు తరలిపోవాలన్న ఆజ్ఞ అంతిమ దినం వరకూ ఉంటుంది సుమా!
ప్రశ్న : ఈ వాదనకు ఏదైనా ఆధారం ఉందా?
**జవాబు :** ఉంది దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వచనాన్ని శ్రద్ధగా అధ్యయనం చేయండి-
**"తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి ప్రాణాలను తీసి, దైవదూతలు వారిని,'ఇదేమిటీ మీ స్థితి ఇలా ఉంది?'అని అడిగారు.అప్పుడు వారు ఇలా సమాధానం చెప్పారు; 'మేము భూమిపై బలహీనులముగా, నిస్సహాయులముగా ఉండేవారము."అల్లాహ్ భూమి విశాలముగా లేదా మీరు వలస పోవటానికి?'అని దైవదూతలు అడిగారు. వారి నివాసం నరకం. అది మహాచెడ్డ నివాసం.అయితే నిజంగానే నిస్సహాయులై బయలుదేరటానికి ఏ మార్గమూ, ఏసాధన సంపత్తీ లేని పురుషులనూ, స్త్రీలనూ పిల్లలనూ అల్లాహ్ క్షమించవచ్చు.(ఎందుకంటే) అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడూ అధికంగా మన్నించేవాడూను."** **(అన్ నిసా- 97, 98)**
ఇంకా ఇలా అనబడింది:
**"విశ్వసించిన నా దాసులారా! నా భూమి విశాలమైనది, కనుక మీరు నన్ను మాత్రమే ఆరాధించండి." (అన్‌కబూత్ - 56)**
ప్రశ్న : పై రెండు వచనాల అవతరణ యొక్క పూర్వ రంగం ఏమిటి?
**జవాబు :** మొదటి ఆయతు అవతరణా సందర్భం : మక్కాకు చెందిన కొంత మంది ఇస్లాం స్వీకరించారు. కాని వారు దైవప్రవక్త (స)తో పాటు హిజ్రత్ చేయలేక మక్కాలోనే ఉండి పోయారు. అటువంటి వారిలో కొంత మంది తమ విశ్వాసంపై నిలకడ కలిగి ఉండలేక, కాలం వేసే కళ్ళెంలో ఇరుక్కుని, పరిస్థితుల ఇంద్రజాలా నికి మోసపోయారు.ఆఖరికి వారు బద్ర్ సంగ్రామంలో ముష్రిక్కుల పక్షాన నిలిచారు.అందుచేత అల్లాహ్ వారి వినతిని తోసిపుచ్చాడు.వారు ఒడిగట్టిన స్వామి ద్రోహానికి ప్రతిఫలంగా వారి కొరకు నరకాన్ని వొసగాడు. రెండవ వచనానికి పూర్వ రంగం ఏమంటే; మక్కాలో కొంతమంది ముస్లిములు హిజ్రత్ చేయలేక ఉండిపోయారు.అప్పుడు అల్లాహ్ వారి విశ్వాసాన్ని (ఈమాన్) వారికిజ్ఞాపకం చేసి హిజ్రత్ (ప్రస్థానం) వైపునకు పురికొల్పాడు.
ప్రశ్న : 'హిజ్రత్' ఒక శాశ్విత ప్రాతిపదిక గల ఆజ్ఞ అనడానికి హదీసులో ఆధారం ఏదన్నా ఉందా?
**జవాబు :** ఉంది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు:
**"పశ్చాత్తాపం (ద్వారం)మూసుకునే దాకా హిజ్రత్ (ద్వారం)మూసుకొనదు.సూర్యుడు**

**తను అస్తమించే చోటున ఉదయించే దాకా పశ్చాత్తాపం (ద్వారం కూడా) మూసుకొనదు సుమా!"**
ప్రశ్న: మదీనా మునవ్వరాలో స్థిరపడిన తరువాత దైవప్రవక్త (సఅసం) వారు ఇచ్చిన ఆదేశాలు ఏవి?
**జవాబు :** మదీనాలో స్థిరపడగానే ప్రవక్త (సఅసం) ఇస్లాం యొక్క మిగిలిన ఆదేశాలను-అంటే; జకాత్, రోజా, హజ్, అజాన్ మరియు జిహాద్ తదితర ఆదేశాల ను జారీ చేశారు.
ప్రశ్న: ఈ విధంగా దైవప్రవక్త (సఅసం) ఎంతకాలం మదీనాలో ప్రజల జీవితాలను తీర్చిదిద్దారు?
**జవాబు :** 10 సంవత్సరాలు. ఆ తరువాత దైవప్రవక్త (సఅసం) పరమపదించారు. కాని ఆయన నెలకొల్పిన ధర్మం మాత్రం యథాతథంగా ఉంది. ఆయన మనకు అందజేయని శుభం లేదు. అన్ని రకాల హానికరమయిన వాటి నుండి ఆయన తన అనుచర సమాజాన్ని జాగరూకపరచి వాటికి దూరంగాఉండాలని హెచ్చ రించారు.
ప్రశ్న : ఆయన (స) మనకు తెలియజేసిన శుభం ఏది?ఆయన ఏ కీడు గురించి హెచ్చరించారు?
**జవాబు :** ఆయన మనకు తౌహీద్ (దేవుని ఏకత్వం) గురించి నొక్కి చెప్పారు. దైవానికి సమ్మతమయిన, ఇష్టకరమయిన వస్తువులేవో స్పష్టం చేశారు. ఇదంతా మన పాలిట మేలుగా, శుభంగా పేర్కొనబడుతుంది.
ఇకపోతే ఆయన (స), షిర్క్ (బహు దైవారాధన) గురించి గట్టిగా హెచ్చరించారు. దైవానికి సమ్మతం కాని, హానికరమయిన వస్తువులు ఏవేవో సూచించి వాటి యెడల మనందరినీ అప్రమత్తం చేశారు.
ప్రశ్న: అల్లాహ్ ఆయన్ని ఏదైనా ప్రత్యేక వర్గానికో, తెగకో ప్రవక్తగా చేసి పంపాడా?
**జవాబు :** అల్లాహ్ ఆయన్ని సమస్త మానవాళి కోసం ప్రవక్తగా చేసి పంపాడు. జిన్నులు మానవులంతా ఆయనకు విధేయత చూపటం తప్పనిసరి గావించాడు.
ప్రశ్న: దీనికి ఆధారం ఏమిటి?
జవాబు : దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్ దీనికి ఆధారం-
**(ఓ ముహమ్మద్!) ఇలా ప్రకటించు: నేను మీఅందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి." (అల్ బఖర : 158)**
ఇంకా ఇలా అనబడింది -
**"ఆ సంఘటన కూడా ప్రస్తావించదగినదే. అప్పుడు మేము జిన్నాతుల ఒక వర్గాన్ని ఖుర్‌ఆన్ వినేందుకు నీ వద్దకు తీసుకు వచ్చాము." (అల్ అహ్ఖాఫ్ - 29)**
ప్రశ్న : అల్లాహ్ ఆయన (స) ద్వారా ధర్మాన్ని పరిపూర్ణం గావించాడా? లేక ఆయన (స) తదనంతరం ధర్మాన్ని పూర్తి చేశాడా?
**జవాబు :** అల్లాహ్ ఆయన (స) ద్వారా-ఆయన (స) బ్రతికి ఉండగానే-ధర్మాన్ని

పరిపూర్ణం గావించాడు. ఆయన (స) తదనంతరం ధర్మంలో ఎలాంటి వస్తువునూ చేర్చవలసిన అవసరం లేదు.

ప్రశ్న : దీనికి ఆధారం ఏదన్నా ఉందా?

**జవాబు :** ఉంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌ను చూడండి:

**"ఈ రోజు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం గావించాను.ఇక దీనితో నా వరాలను కూడా పూర్తి చేశాను.ఇంకా ఇస్లాంను మీ జీవనధర్మంగా సమ్మతించాను." (అల్ మాయిద - 3)**

ప్రశ్న: ఆయన మరణించారనడానికి ఆధారం ఏమిటి?

**జవాబు :** ఆయన మరణం సత్యమనడానికి దివ్య ఖుర్‌ఆన్‌లోనిఈవచనమే నిదర్శనం.

**"(ఓ ప్రవక్తా!) నీవూ మరణిస్తావు. వారూ మరణిస్తారు.చివరకు ప్రళయం నాడు మీరంతా మీ ప్రభువు సమక్షంలో మీ మీ వ్యాజ్యాలను వినిపిస్తారు."(అజ్ జుమర్ - 30)**

ప్రశ్న : మరణించిన పిదప ప్రజలు మళ్లీ బ్రతికించబడతారా?

**జవాబు :** అవును. బ్రతికించబడతారు. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌ని చూడండి.

**"ఈ నేల నుండే మేము మిమ్మల్ని సృష్టిం చాము, దాని లోనికే మేము మిమ్మల్ని తిరిగి తీసుకుపోతాము. దాని నుండే మిమ్మల్ని మళ్లీ వెలికి తీస్తాము." (తాహా-55)**

ఇంకా ఈ విధంగా సెలవీయబడింది.

**"అల్లాహ్ మిమ్మల్ని భూమి నుండి చిత్ర విచిత్రంగా మొలిపించాడు. తరువాత ఆయన మిమ్మల్ని ఈ భూమిలోకే తిరిగి తీసుకుపోతాడు. మళ్లీ దానినుండే ఎకాఎకీ మిమ్మల్ని బయటకు తీసి నిలబెడతాడు." (నూహ్ - 17)**

ప్రశ్న : తిరిగి బ్రతికించబడిన తరువాత ప్రజల లెక్క తీసుకోబడుతుందా? వారికి శిక్షాబహుమానాలు లభిస్తాయా?

**జవాబు :** అవును.ప్రజల లెక్క తేల్చబడుతుంది.వారి కర్మలను బట్టి శిక్ష విధించటమో, బహుమానం ఒసగటమో జరుగుతుంది.దీనికి ఆధారం ఇది:

**"చెడు చేసే వారికి, అల్లాహ్ వారి కర్మలకు ప్రతిఫలం ఇచ్చేందుకు, సదాచరణ వైఖరి అవలంబించిన వారికి మంచి ప్రతిఫలం ప్రసాదించేందుకు (అల్లాహ్ ఉన్నాడు)". (అన్ నజ్మ్ -31)**

ప్రశ్న : మరణానంతర జీవితాన్ని త్రోసిపుచ్చిన వ్యక్తి గురించి ఏమనబడింది?

**జవాబు :** మరణానంతర జీవితాన్ని త్రోసిపుచ్చిన వాడు అవిశ్వాసి (కాఫిర్) అని అనబడింది. దీనికి ఆధారం దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వచనం -

**"తాము మరణించిన తరువాత మళ్లీ లేప బడటం అనేది ఎంత మాత్రం జరుగదు అని అవిశ్వాసులు పెద్ద సవాలు విసిరారు. వారితో ఇలా అను: 'కాదు, నా ప్రభువు సాక్షిగా! మీరు తప్పకుండా లేపబడతారు. తరువాత, మీరు (ప్రపంచంలో) ఏమేమి చేశారో అదంతా మీకు తప్పకుండా తెలియ జేయటం జరుగుతుంది. ఇలా చేయటం**

**అల్లాహ్‌కు చాలా సులభం." (అత్ తగాబున్ -7)**
ప్రశ్న: అల్లాహ్ తన ప్రవక్తలకు ఏమని ఉపదేశించి పంపాడు**?**
**జవాబు :** దేవునిఏకత్వాన్ని (తౌహీద్‌ను) అవలంబించేవారికి స్వర్గలోకపు శుభవార్తనివ్వమనీ, బహు దైవోపాసన (షిర్క్)కు ఒడిగట్టే వారిని నరక యాతన గురించి హెచ్చరించమనీ అల్లాహ్ తన ప్రవక్తలకు ఉపదేశించి పంపాడు.
ప్రశ్న : దీనికి ఆధారం ఏమిటి?
**జవాబు :** దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు -
**"ఈ ప్రవక్తలందరూ శుభవార్తను తెలిపే వారుగా,హెచ్చరిక చేసేవారుగా పంప బడ్డారు-వారి ఆవిర్భావం తరువాత అల్లాహ్‌కు ప్రతికూలంగా వాదించటానికి ప్రజల వద్ద ఏ సాకూ మిగల కూడదని." (అన్ నిసా - 163)**
ప్రశ్న : ప్రప్రథమ ప్రవక్త ఎవరు?
**జవాబు :** హజ్రత్ నూహ్ అలైహిస్సలాం.
ప్రశ్న : దీనికి ఆధారం ఏమిటి?
**జవాబు :** ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :
**"(ప్రవక్తా!) నూహ్ వైపునకు, ఆయన తరువాతి ప్రవక్తల వైపునకు పంపినట్లుగా మేము నీ వైపునకు వహీ (దైవవాణి) ని పంపాము." (అన్ నిసా -163)**
ప్రశ్న : దైవప్రవక్త పంపబడని జాతి ఏదైనా ఉందా?
**జవాబు :** లేదు. అన్ని జాతుల వద్దకు దేవుని తరఫున ప్రవక్తలు పంపబడ్డారు. దీనికి ఆధారంగా దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌ను గమనించండి:
**"మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలాహెచ్చరిక చేశాము: 'అల్లాహ్‌ను ఆరాధించండి. మిథ్యా దైవాల (తాగూత్) ఆరాధ నకు దూరంగా ఉండండి." (అన్ నహ్ల్- 36)**
ప్రశ్న : 'తాగూత్' అంటే అసలేమిటి?
**జవాబు :** ఆరాధన విషయంలో దాసుడు హద్దు మీరి పోవటమే 'తాగూత్'. తాగూత్ అనేది ఆరాధించే వానికీ, ఆరాధించబడే వానికీ వర్తిస్తుంది.తాగూత్ ఒక మిథ్య. ఒక పైశాచిక మార్గం.
ప్రశ్న : తాగూత్‌లు ఎన్ని రకాలు?
**జవాబు :** అనేక రకాలు.అయితే వాటిలో ఐదు రకాలు ముఖ్యమైనవి.1) దైవ ధూత్కారి అయిన ఇబ్లీస్ 2) అల్లాహ్ మినహా-ప్రజల చేత కొలవబడే వ్యక్తి. 3) తనను పూజించమని ప్రజలను కోరే వ్యక్తి. 4) తనకు అగోచర జ్ఞానం ఉందని ప్రగల్భాలు పలికే వాడు.5) దైవం తరఫున అవతరింపజేయబడిన షరీఅత్‌కు విరుద్ధంగా తీర్పులు చేసేవాడు (ఇటువంటి మిథ్యా దేముళ్ళను తిరస్క రించాలనీ, వారికి దూరంగా ఉండాలనీ, దైవ విధేయులుగా జీవించాలనీ అల్లాహ్ మనకు ఆజ్ఞాపించాడు).

ప్రశ్న : దీనికి ఆధారం ఏమిటి?

**జవాబు** : దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ వచనమే దీనికి ఆధారం-

**"ధర్మం విషయంలో నిర్బంధం గానీ, బలాత్కారం గానీ లేదు. సత్యవాక్కు అసత్య వాక్కుల నుండి ప్రస్ఫుటం చెయ్యబడింది.ఇక నుండి'తాగూత్'ను తిరస్కరించి, అల్లాహ్‌ను విశ్వసించిన వాడు సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆశ్రయం పొందినట్లే. (అతడు ఆశ్రయించిన) అల్లాహ్ సర్వమూ వింటాడు, సమస్తమూ తెలిసినవాడు."**

(అల్ బఖరా - 256)

వేరొక చోట ఇలా సెలవిచ్చాడు :

**"మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరికచేశాము : "అల్లాహ్‌ను ఆరాధించండి. తాగూత్ (మిథ్యాదైవాల) ఆరాధన కు దూరంగా ఉండండి." (అన్ నహ్ల్ -36)**

ఇంకొక చోట ఇలా చెప్పబడింది.

**ఓ ప్రవక్తా! ఇలా చెప్పు : "గ్రంథ ప్రజలారా! మాకూ-మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి (అదేమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు.మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది".ఈ సందే శాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే వారితో స్పష్టంగా ఇలా అను: "మేము ముస్లిములలో (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారు, విధేయత చూపేవారు) అనే విషయానికిమీరు సాక్షులుగా ఉండండి." (ఆలి ఇమ్రాన్ - 64)**

**ఇదీ అసలు"లా ఇలాహ ఇల్లల్లాహ్" విస్తృత భావం హదీసులో ఇలా వుంది : "అసలు విషయం ఇస్లాం. దానిస్తంభం నమాజ్.దాని ఉన్నత సోపానం దైవ మార్గంలో పోరాటం."**

# ఇస్లాం ధర్మం యొక్క నాలుగు నియమాలు

మహోన్నత సింహాసనానికి అధిపతి అయిన అల్లాహ్ దర్బారులో అభ్యర్థించుకుంటున్నాను-ఆయన ఇహపరాలలో మిమ్మల్ని పర్యవేక్షిస్తూ ఉండు గాక! మీరెక్కడున్నా మిమ్మల్ని శుభవంతుల్ని చేయు గాక! కలిమిని ప్రసాదించి నపుడు కృతజ్ఞతలు తెలుపుకునే, లేమికి గురి చేసినప్పుడు సహనం వహించే, తప్పులు జరిగిపోయినప్పుడు పశ్చాత్తాపం చెందే సజ్జనులకోవలో మిమ్మల్ని చేర్చు గాక!-ఈ మూడు విషయాలే మహాభాగ్యం అనబడతాయి.

ఆరాధనలో ఏకాగ్ర చిత్తం కలిగి ఉండటం-ఇబ్రాహీం (అలైహి) అనుయాయు నిగా మారటం-అంటే ఏమిటో తెలుసా?! ఒక్కడైన అల్లాహ్‌ను సేవించడంలో చిత్త శుద్ధినీ, వజ్ర సంకల్పాన్ని కనబరచటం!

అల్లాహ్ ఇలాసెలవిచ్చాడు. **"మేము మానవుల్ని, జిన్నుల్ని మా దాస్యం కోసమే**

**పుట్టించాము." (అజ్జారియాత్ : 56)**

అల్లాహ్ తన దాస్యం కోసమే మిమ్మల్ని పుట్టించాడన్న సంగతి మీకు తెలిసినప్పుడు, ఆ దాస్యం స్వచ్ఛమైన - ఏకేశ్వరోపాసన (తౌహీద్) - తో కూడుకున్నదై ఉండాలన్న సత్యం కూడా మీరు తెలుసుకోవటం అవసరం. ఏ విధంగానయితే మీరు శుచీ శుభ్రతల (తహారత్)ను పాటించినపుడే నమాజ్ నెరవేరుతుందో అదే విధంగా అద్వితీయుడైన అల్లాహ్‌కు భాగస్వామ్యం (షిర్క్)కల్పించకుండా ఉన్నప్పుడే దాస్యం స్వీకార యోగ్యం అవుతుంది. ఆరాధన (దాస్యం)లోనే గనక 'షిర్క్' వచ్చి చేరితే అది కలుషితం అయిపోతుంది.శుచీ శుభ్రతలను అశుద్ధ వస్తువులు పాడు చేసేసినట్లే షిర్క్‌తో కూడుకున్న పనులు స్వచ్ఛమైన తౌహీద్‌ను పాడు చేసేస్తాయి.

దివ్యగ్రంథంలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు-

**"ముష్రిక్కులు అల్లాహ్ మసీదులలో సంరక్ష కులుగా, సేవకులుగా ఉండటానికి పనికి రారు. ఎందుకంటే వారే స్వయంగా అవిశ్వా సు లమని తమకు వ్యతిరేకంగా సాక్ష్య మిస్తున్నారు. వారి కర్మలైతే అన్నీ వ్యర్థమై పోయాయి.నరకంలో వారు కలకాలం ఉండాలి." (అత్ తౌబా -17)**

'షిర్క్' (భాగస్వామ్యం) వల్ల ఆరాధనలు, ఆచరణలన్నీ వ్యర్థమైపోతాయనీ, ముష్రిక్కుల పర్యవసానం నరకమని మీకు తెలిసిపోయిన మీదట, ఆ 'షిర్క్' గురించి క్షుణ్ణంగా తెలుసుకుని, దానిపట్ల జాగ్రత్త పడవలసిన బాధ్యత కూడా మీపై ఉంది; అప్పుడే మీరు ఆ వినాశకర చేష్ట నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోగలుగుతారు. దాని గురించి అల్లాహ్ ఇలా అంటున్నాడు -

**"అల్లాహ్ దృష్టిలో షిర్కు ఒక్కటే క్షమార్హం కానిది.అది తప్ప తాను కోరిన వారి అన్ని పాపాలను ఆయన క్షమిస్తాడు." (అన్ నిసా - 116)**

అల్లాహ్ తన గ్రంథంలో ప్రస్తావించిన ఈ క్రింది నాలుగు ప్రధానాంశాలను తెలుసుకున్నప్పుడే దీని గురించిన పూర్తి అవగాహన ఏర్పడుతుంది.

## మొదటి నియమం :

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు వ్యతిరేకంగా వైర వైఖరిని అవలంబించి, కయ్యానికి కాలు దువ్విన అవిశ్వాసులు కూడా అల్లాహ్‌ను సృష్టి కర్తగా, ఉపాధి ప్రదాతగా, విధాతగా అంగీకరించేవారు. కాని వారి ఈ అంగీకారం వారిని ఇస్లాంలో చేర్చలేకపోయింది. (అంటే ఒక్కడైన అల్లాహ్‌ను సేవించే వరకూ వారు ముస్లింలు కాలేకపోయారు.)దివ్యగ్రంథంలోని దైవోపదేశం ఇందుకు ప్రబల నిదర్శనం-

**వారిని అడుగు : ఆకాశం నుండీ, భూమి నుండీ మీకు ఉపాధినిచ్చేవాడు ఎవడు? వినే శక్తీ, చూసే శక్తీ ఎవడి అధీనంలో ఉన్నాయి? ప్రాణములేని దాని నుండి ప్రాణమున్న దానినీ, ప్రాణమున్న దాని నుండి ప్రాణములేని దానినీ వెలికి తీసే**

**వాడు ఎవడు? ఈ విశ్వ వ్యవస్థను నడుపు తున్న వాడు ఎవడు? "అల్లాహ్" అని వారు తప్పకుండా అంటారు. ఇలా అను: "అలాం టప్పుడు మీరు (షిర్క్‌కు వ్యతిరేకంగా నడవటం) మానుకోరేమిటి?" (యూనుస్ - 31)**

## రెండవ నియమం :

తాము వాళ్ళను (తమ మిథ్యా దైవాలను, వలీలను) కేవలం సామీప్యం కోసం, సిఫారసు కోసమే పిలుస్తున్నామని ముష్రిక్కులు అనేవారు. ఈ సామీప్యానికి వారిచ్చే నిదర్శనం ఏమిటంటే ఈ వలీలు, పుణ్య పురుషులు తమను అల్లాహ్‌కు చేరువ చేస్తారని అనేవారు. కాని ఇది పచ్చి షిర్క్. ఈ సందర్భంగా అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

**ఇక ఆయనను వదిలివేసి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్న వారు, (తమ ఈ చర్యకు సమర్థింపుగా)"వారు మమ్మల్ని అల్లాహ్ వద్దకు చేరుస్తారని మాత్రమే వారిని ఆరాధిస్తున్నాము" అని అంటారు.అల్లాహ్ నిశ్చయంగా వారి మధ్యన వారు విభేదిస్తున్న అన్ని విషయాలను గురించి తీర్పు చెబు తాడు. అసత్యవాదీ, సత్య ధిక్కారి అయిన ఏ వ్యక్తికీ అల్లాహ్ సన్మార్గం చూపడు.' (జుమర్-3)**

సిఫారసుకు సంబంధించిన (అంటే వారు కల్పించుకున్న కాల్పనిక దేవుళ్ళు వారికి వారధిగా ఉంటారన్న వారి నమ్మకం షిర్క్ అని చాటి చెప్పే) ఆయతు - **"ఈ ప్రజలు అల్లాహ్‌ను కాదని తమకు నష్టాన్ని గానీ, లాభాన్ని గానీ కలిగించలేని వారిని పూజిస్తున్నారు.పైగా ఇలా అంటు న్నారు : "వారు అల్లాహ్ వద్ద మా కొరకు సిఫారసు చేస్తారు." (ప్రవక్తా!) వారితో ఇలా అను : ఆకాశాలలో గానీ, భూమిలో గానీ అల్లాహ్ ఎరుగని విషయాన్ని గురించి ఆయనకు మీరు తెలుపుతున్నారా?" ఆయన పరిశుద్ధుడు.ఈ ప్రజలు చేసే షిర్కుకు అతీతుడు, ఉన్నతుడూను." (యూనుస్ : 18)**

సిఫారసు రెండు రకాలు. ఒకటి : నకారాత్మక సిఫారసు. రెండు : సకారాత్మక సిఫారసు.

**1. నకారాత్మక సిఫారసు** : అంటే అల్లాహ్‌కు మాత్రమే సాధ్యమైన వాటి కోసం దైవేతరుల ముందు అర్థించటం. దీనికి ఆధారం ఇది :

**"విశ్వసించిన ఓ ప్రజలారా! క్రయ విక్రయాలు కూడా జరగని, మైత్రీ ఉపయోగ పడని, సిఫారసు కూడా చెల్లని, ఆ (చివరి) దినము రాక పూర్వమే, మేము మీకు ప్రసాదించిన సిరి సంపదలనుండి (మా మార్గంలో)ఖర్చుపెట్టండి. వాస్తవంగా అవి**

1. ఈ సూక్తి గురించి వ్యాఖ్యానిస్తూ అల్లామా ఇబ్నె కసీర్ (రహ్మ.లై) ఇలా అంటున్నారు - అల్లాహ్ తన దాసులకు, తాను ప్రసాదించిన ఉపాధి నుండి, తన మార్గంలో ఖర్చుపెట్టమని ఆదేశిస్తున్నాడు.ఎందుకుఎందుకంటే వారు తమ ప్రభువు వద్ద తమ పుణ్య దానులను సమకూర్చుకోవాలని! ప్రళయ దినం రాకముందే వారు ఈ పని చేసేసుకోవాలి.ఆ రోజు ఎంత కఠినమైనదంటే, ఆనాడక్కడ క్రయ విక్రయాలు గానీ, బేరసారాలు గానీ, స్నేహసంబంధాలు గానీ, రికమండీషన్లు గానీ ఏ మాత్రం పనికిరావు. పరిహారంగా సొమ్ము ఇవ్వటం కుదరదు. భూమండలం లోని బంగారాన్నంతటినీ ఇచ్చినా ఆనాడు మనిషి తన్ను విడిపించుకోలేడు. ఆవగింజంత ప్రయోజనం కూడా తన ఆత్మకు చేకూర్చు కోజాలడు.

శంఖం ఊదబడిన రోజున వారు ఒక పట్టాన నిలదొక్కుకోవటం గానీ, ఒండొకరిని పరామర్శిం చుకోవటం గానీ చేయలేరు. సిఫారసు చేసేవారి సిఫారసు కూడా ఏ విధంగానూ వారికి ఉపయోగ పడదు.

**శ్వాస మార్గం అవలంబించేవారే దుర్మా ర్గులు".**[1] **(అల్ బఖర : 254)**

**2. సకారాత్మక సిఫారసు :** అంటే అల్లాహ్‌ను మాత్రమే వేడుకొనే సిఫారసు. సిఫారసు చేసేవాడు కూడా ఈ సిఫారసు మూలంగా ఆదరణీయుడవుతాడు. ఎవరి కోసమైతే సిఫారసు చేయబడుతుందో అతని పట్ల అల్లాహ్ కూడా ప్రసన్నుడవు తాడు. ఇటువంటి సిఫారసు కేవలం అల్లాహ్ నుండి మాత్రమే అర్థించబడుతుంది. ఎందుకంటే సిఫారసును ఆమోదించటం లేక ఆమోదించక పోవటమన్నది అల్లాహ్ అభీష్టంపైనే ఆధారపడి ఉంటుంది.కనుక దైవేతరుల నుండి అర్థించేవాడు షిర్క్‌కు ఒడిగట్టినట్లే. ఎందుకంటే అతడు చేయరాని పనిని చేశాడు.'వేడుకోలు'కు విరుద్ధమైన వైఖరిని అవలంబించాడు.అల్లాహ్ కేవలం ఏకేశ్వరోపాసనను మాత్రమే ఇష్టపడతాడు. ఏకేశ్వరోపాసకులకై చేసే సిఫారసును మాత్రమే అంగీక రించి ఆమోదిస్తాడు. దివ్య ఖుర్‌ఆన్‌లో ఆయన సెలవిచ్చినట్లు -

**1) "ఆయన సన్నిధిలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగల వాడెవ్వడు?"**
**(అల్ బఖర - 255)**

**2) "వారు ఎవరిని గురించీ సిఫారసు చేయరు, సిఫారసు వినటానికి అల్లాహ్ ఇష్ట పడిన వాని విషయంలో తప్ప."** **(అంబియా - 28)**

**3) "ఇంకా ఇలా అను : సిఫారసు అనేది పూర్తిగా అల్లాహ్ చేతిలోనే ఉన్నది."**
**(అజ్ జుమర్ - 44)**

మూడవ నియమం:

దైవప్రవక్త (సఅసం) పెక్కు ఆరాధ్య దైవాలను పూజించే ప్రజల్లో ప్రభవింప జేయబడ్డారు.ఆ ప్రజల్లో కొందరు దైవదూతలను పూజించగా, మరి కొందరు దైవప్రవక్తలను ఆరాధించేవారు. కొందరు మహనీయులను కొలవగా, ఇంకొందరు చెట్టు పుట్టలను, రాళ్ళు రప్పలను కొలిచేవారు. మరికొందరు సూర్యచంద్రులను సేవించేవారు. దైవప్రవక్త (సఅసం) వీళ్ళందరి మిథ్యా విధానాన్ని అంతమొం దించారు.ఈ విషయంలో వారి మధ్య ఎలాంటి వ్యత్యాసం కనబరచలేదు. దీనికి నిదర్శనం ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి.

**"పీడన ఏ మాత్రం మిగలకుండా పోయే వరకు, అల్లాహ్‌నిర్ణయించిన ధర్మం పూర్తిగా నెలకొల్పబడే వరకు ఈ అవిశ్వాసు లతో యుద్ధం చేయండి."** **(అన్‌ఫాల్ - 39)**

సూర్యచంద్రుల దాస్యానికి సంబంధించిన నిదర్శనం ఇది:

**"రేయింబవళ్ళు, సూర్యచంద్రులు అన్నీ ఆయన(అద్వితీయ శక్తికి)నిదర్శనాల లోనివి. కనుక మీరు సూర్యునికి గానీ, చంద్రునికి గానీ సాష్టాంగ పడకండి. మీకు దైవారాధన చేయాలనే ఉంటే ఈ నిదర్శనా లన్నింటినీ సృష్టించిన దైవానికి మాత్రమే సాష్టాంగపడండి." (హామీమ్ సజ్దా - 37)**

దైవదూతలను పూజించటం కూడా షిర్కేనన్న దానికి తార్కాణం-

**"మీరు దైవదూతలను, దైవప్రవక్తలను మీ ప్రభువుగా చేసుకోమని ఆయన మిమ్మల్ని ఆదేశించటం లేదు."** [1] **(ఆలె ఇమ్రాన్-80)**

దైవప్రవక్తలను పూజించటం, అక్కరల కోసం వారిని అర్థించటం 'షిర్క్' అన్న దానికి ఈ సూక్తి నిదర్శనం:

**(ఆ సన్నివేశాన్ని గురించి కాస్త ఆలోచిం చండి)"మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! నీవు మనుజ జాతితో, అల్లాహ్‌ను కాదని నన్నూ, నాతల్లిని దేవుళ్ళుగా భావించండి అని బోధించావా? అని అల్లాహ్ అడిగి నప్పుడు అతను ఇలా మనవి చేసుకుం టాడు: "నీవు అత్యంత పవిత్రుడవు! ఏ మాటను అనే హక్కు నాకు లేదో ఆ మాటను అనడం నాకు యుక్తమైన పని కాదు. ఒకవేళ నేను ఆ విధంగా అని ఉంటే, అది నీకు తప్పకుండా తెలిసి ఉండేది. నామనస్సులో ఏముందో నీకు తెలుసు. నీమనస్సులో ఏముందో నాకు తెలియదు. నీవుగుప్తంగా ఉన్న యదార్థాలన్నీ తెలిసిన మహా జ్ఞానివి." (అల్ మాయిద - 116)**

ఇక ఔలియాలు, పుణ్యపురుషులకు సంబంధించిన నిదర్శనం (అంటే వాళ్ళను వేడుకుని, వాళ్ళ ఆధారంగా దేవుని సామీప్యం పొందవచ్చుననుకోవటం షిర్క్. ఇలాంటి వ్యవహారాలకు అల్లాహ్ అతీతుడు, ఉన్నతుడు). ఈ సూక్తిని గమనించండి:

**"ఈ ప్రజలు ఎవరిని మొర పెట్టుకుంటున్నారో వారేస్వయంగా తమ ప్రభువు సాన్నిధ్యాన్ని పొందడానికి మార్గాన్ని వెతుకు తున్నారు. ఒకరితో ఒకరు పోటీపడుతు న్నారు. వారు,ఆయన కారుణ్యాన్నిఆశిస్తున్నారు.ఆయన శిక్షకు భయపడుతున్నారు.'2 (బనీ ఇస్రాయీల్- 57)**

ఇక చెట్టు పుట్టలు, రాళ్ళు రప్పలకు సంబంధించిన నిదర్శనం - అంటే

---

[1] ఈ సూక్తికి వ్యాఖ్యానంగా హాఫిజ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: తనను తప్ప మరొకరిని పూజించమని దేవుడు ఎన్నడూ ఆదేశించడు. తన దూతలను పూజించమని గానీ, తాను పంపిన ప్రవక్తలను ఆరాధించమని గానీ కోరడు. ఇస్లాం స్వీకరించిన తరువాత ధిక్కార వైఖరికి ఒడిగట్టమని కూడా అనడు. దైవేతరుల దాస్యం చేయమని పిలుపు ఇచ్చేవాడే ఇలాంటి ఆజ్ఞలు జారీ చేస్తాడు. దైవేతరుల దాస్యం కొరకు ఆహ్వానించిన వాడు నిశ్చయంగా కుఫ్ర్‌కి (అవిశ్వాసానికి) ఒడిగట్టాడు. కాగా; దైవప్రవక్తలు సతతం ఈమాన్ గురించి మాత్రమే ఉపదేశిస్తారు. సాటిలేని సృష్టికర్తను నమ్మటం, దాస్యం చేయటమే ఈమాన్ బిల్లాహ్.

---

2. "ఉలాయి కల్లజీన........" సూక్తి గురించి బుఖారీలో హజ్రత్ అబ్దుల్లాహ్‌చే ఇలా ఉల్లేఖించబడింది - ప్రజలు మొర పెట్టుకునే ఆ కొంతమంది ఎవరంటే వారు జిన్ను వర్గానికి చెందిన వారు. తరువాత వారు ఇస్లాం స్వీకరించారు.

హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ఈ విధంగా వుంది: ఈ ఆయతు జిన్నులను పూజించే అరబ్బులను ఉద్దేశించి అవతరించింది. ఆ జిన్నులు తరువాత ఇస్లాం స్వీకరించారు. ఆ సందర్భంగానే ఈ ఆయతు అవతరించింది. వాస్తవం అల్లాహ్ ఎరుక. (షేఖ్ ముహమ్మద్ మునీర్ డెమాస్కసీ)

వృక్షా లను, రాళ్ళను పూజించటం, మహనీయుల సమాధుల నుండి శుభం పొందాలని తాపత్రయ పడటం, తమ కష్టాలను, కడగండ్లను దూరం చేసుకోవటానికి వాళ్ళను మొక్కుకోవటం,వారి పేరున జంతువులను కోయటం, ఆ సమాధుల వద్ద కొంత కాలంపాటు గడపటం, అక్కడే ఆరాధనలు చేయటం, అక్కడి మట్టితో, వస్త్రాలతో 'శుభం' పొందగోరటం-ఇవన్నీ 'షిర్క్'గా పరిగణించ బడతాయి. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు -

**ఇప్పుడు చెప్పండి : "ఈ లాత్, ఈ ఉజ్జా, మూడోది ఒక దేవత అయిన మనాత్‌ల వాస్తవికత గురించి మీరు కాస్తయినా ఆలోచించారా?" (అన్ నజ్మ్ : 19)**

అల్లాహ్ ముష్రిక్కుల వైఖరిని ఖండిస్తూ ఈ ఆయతును అవతరింపజేశాడు. వాళ్లు విగ్రహాలను, దేవీదేవతలను పూజించేవారు. వాళ్ల పేరుతో కాబా గృహం మాదిరిగా కట్టడాలు నిర్మించేవారు. **లాత్** : తాయఫ్‌లో ఒక తెల్లని రాయి ఉండేది. దానిపై ఓ గృహం నిర్మించబడింది.అందులో అనేక తెరలు ఉండేవి.అనేక మంది సేవకులుండేవారు. దాని చుట్టూ మైదానాలుండేవి. తాయఫ్‌లో సఖీఫ్ తెగవారి దృష్టిలోఈ కట్టడం ఎంతో పవిత్రమైనదిగా, పూజనీయంగా ఉండేది.ఆ ప్రదేశంలో ఆ విగ్రహం ఉన్నందుకు ఖురైషులతోపాటు ఇతర అరబ్బు తెగలవారు కూడా గర్వపడేవారు.

**ఉజ్జా:** ఇదొక వృక్షం.ఇది 'నఖ్లా' అనే స్థలంలో ఉంది. ఈ 'నఖ్లా' మక్కా నగరానికి -తాయఫ్ పట్టణానికి మధ్య ఉంది. ఈవృక్షంపై ఒక కట్టడం వెలిసింది. దానిపై కొన్ని పరదాలు వ్రేలాడదీయబడ్డాయి. ఖురైష్ తెగవారు ఈకట్టడాన్ని ఆరాధించేవారు.ఈ కారణంగానేనేమో ఉహుద్ యుద్ధ దినాన అబూ సుఫ్యాన్ ఈ కట్టడాన్ని తలచుకుంటూ''మాకు అండగా, ఉజ్జా దేవత ఉంది. మీకెవరున్నారు?!'' అని ముస్లింలకు సవాలు విసిరాడు.దానికి సమాధానంగా మహాప్రవక్త (సఅసం) తన ప్రియ సహచరుల చేత,''అల్లాహ్ మాకు అండగా ఉన్నాడు. మీకు అండగా ఎవరూ లేరు'' అని చెప్పించారు.

**మనాత్** : మక్కా-మదీనా నగరాల మధ్య ముసల్లల్ అనే స్థలంలో ఈ విగ్రహం ఉండేది. అజ్ఞాన కాలంలో ఖుజాఅ, ఔస్, ఖజ్రజ్ తెగల వారు ఈ విగ్రహానికి తమ శ్రద్ధాభక్తుల నివాళి ఘటించేవారు. హజ్ నెలలో కాబాకు వచ్చే యాత్రికులు ఈ స్థలం నుండే ఇహ్రామ్ దీక్ష బూనేవారు.ఈ కట్టడాలన్నింటినీ కూల్చడానికి మహాప్రవక్త (సఅసం) కొంతమంది సహాబీలను పంపించారు. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని మాత్రం 'ఉజ్జా' వైపునకు పంపారు.ఆయన ఆ కట్టడాన్ని నేలమట్టం చేస్తూ ఇలా పలికారు:-

ఓ ఉజ్జా! నేను నిన్ను ధిక్కరిస్తున్నాను. నీ పవిత్రతను కొనియాడబోను. అల్లాహ్ నీకు దుర్గతి పట్టించాడు.''

హజ్రత్ ముగీరా బిన్ షోబ (రజి), హజ్రత్ సుఫ్యాన్ (రజి)లను 'లాత్' విగ్రహం

వైపునకు పంపించగా వారిద్దరూ కలసి ఆ విగ్రహాన్ని కూల్చివేశారు. ఆస్థలంలో ఒక మస్జిద్‌ను కూడా నిర్మించారు.ఈ విగ్రహం తాయఫ్ పట్టణంలో ఉండేది.

మనాత్ విగ్రహం వైపునకు హజ్రత్ సుఫ్యాన్ పంపించబడ్డారు.ఆయన దాన్ని పడగొట్టారు. హజ్రత్ అలీ బిన్ అబూ తాలిబ్ పడగొట్టారని కూడా ఒక ఉల్లేఖనం ఉంది.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారు సత్య ధర్మాన్ని తీసుకువచ్చారు. ఒక్కడైన సృష్టికర్తను సేవించమనీ, దైవారాధన స్వచ్ఛంగా ఉండాలనీ ఆయన ప్రజలకు బోధించారు.దురాచారాలను, షిర్కుతో కూడుకున్న కర్మలను ఆయన నిర్మూలిం చారు. ఆయన ప్రియ సహచరులు, వాళ్ల శిష్యులు కూడా ఈ సత్య ధర్మంపై స్థిరంగా ఉన్నారు. అయితే కాలక్రమేణా అనుయాయుల ధర్మావలంబ నలో మార్పులు వచ్చాయి. ఆచరణలు కలగాపులగం అయి చాలా మంది ముస్లింలు షైతాన్ ఎత్తులకు చిత్తయిపోయారు. మిథ్యావాదులు ముస్లింలను లోబరుచు కున్నారు. వాళ్లు మళ్లీ విగ్రహారాధన వైపునకు మొగ్గసాగారు. తమకు తెలియ కుండానే వాళ్లు నెమ్మదిగా బహు దైవోపాసన వైపునకు తీసుకుపో బడుతున్నారు. కాని పండితులు ఈ విషయాన్ని పట్టించు కోవటం లేదు.ఇది ఎంతో శోచనీయం.

- షేక్ ముహమ్మద్ మునీర్ డెమాస్కసీ

హజ్రత్ అబూ వాఖిద్ లైసీ (రజి) ఇలా అంటున్నారు: ‘‘మేము దైవప్రవక్త (సఅసం)తో కలిసి హునైన్ వైపునకు బయలుదేరాము.ఆరోజుల్లోనే మేము దైవధిక్కార (కుఫ్ర్) ఊబిలో నుండి బయటపడి ఉన్నాము. దారిలో ఒక రేగి చెట్టు ఉండేది. బహు దైవారాధకులు ఆ వృక్షం వద్ద బైఠాయించేవారు. తమ ఆయుధాలను ఆ వృక్షానికి వ్రేలాడదీసేవారు. ఆ వృక్షం ‘‘జాతుల్ నవాద్’’గా పిలువబడేది. ఆ వృక్షం వద్దకు సమీపించగానే, ‘‘దైవప్రవక్తా! ఏవిధంగానయితే ఈ వృక్షం వాళ్లకోసం ‘జాతుల్ నవాద్’గా ఉందో ఆ విధంగా మాక్కూడా ‘జాతుల్ నవాద్’ గా చేయండి’’అని మేవ ప్రాధేయపడ్డాము.దీనిపై మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారు ఆగ్రహం చెందారు.ఆయన (స) ఇలా వ్యాఖ్యా నించారు- ‘‘అల్లాహు అక్బర్! ఇవైతే ప్రాచీన కాలపు ఆచారాలు. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. ఇస్రాయీల్ సంతతి వారు మూసా (అలైహిస్సలాం)తో అన్న మాటలే ఈనాడు మీరు అన్నారు.‘వాళ్ళకున్న ఆరాధ్య దైవాల వంటివేమాకోసం కూడా కల్పించండి’ అనిఇస్రాయీల్ వంశీయులు చెప్పి ఉన్నారు. మీరు ఒట్టి అజ్ఞానులు. మీరు మీ పూర్వీకులయిన యూదుల, క్రైస్తవుల పద్ధతులను అనుసరించేలా ఉన్నారు.’’(తిర్మిజీ)

## నాల్గవ నియమం :

ఈ కాలపు ముష్రిక్కులు పూర్వకాలపు ముష్రిక్కుల కన్నా కడు హీనంగా ఉన్నారు.

ఎందుకంటే, పూర్వకాలపు ముష్రిక్కులు కలిమిలో షిర్క్ (బహు దైవోపాసన)కు పాల్పడే వారు. కష్టకాలం దాపురించగానే ఒక్కడైన దైవం వైపుకు చిత్తశుద్ధితో మరలేవారు. కాని ఈ కలికాలపు ముష్రిక్కులైతే కష్ట కాలంలోనే గాక,సుఖ సంతోషాల సమయాల్లో సైతం బహు దైవారాధనకు పాల్పడుతున్నారు. దైవ గ్రంథంలోని ఈ దైవోపదేశం ఇందుకు ప్రబల తార్కాణం :

**"వారు పడవలోకి ఎక్కినప్పుడు తమ ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని ఆయన్ని వేడుకుంటారు.తరువాత ఆయన వారిని రక్షించి నేలపైకి తీసుకు రాగానే, అకస్మాత్తుగా వారు బహుదైవారాధన చేయటం ఆరంభిస్తారు." (అన్‌కబూత్ : 65)**

మనలోని చాలా మంది తమ పూర్వీకుల, సజ్జనుల సమాధుల వద్దకు పోయి,వాటి ముందు చేయి చాచి అర్థించటం మనం చూస్తూ ఉన్నాము. కలిమిలోనూ, లేమిలోనూ కూడా వీళ్లు ఈ పని చేస్తున్నారు. ప్రాచీన కాలపు ముష్రిక్కులే నయం. ఎందుకంటే వాళ్లు కష్టాల్లో మాత్రం నిజదైవం వైపునకు మరలి, కష్టాలు తీరిపోయిన తరువాత బూటకపు దైవాల వద్దకు పోయేవారు. కాని నవీన ముష్రిక్కులకు ఇలాంటి తేడా పాడా లేమీ లేవు. పైగా కష్టకాలంలో వీళ్ల బహు దైవోపాసనా చేష్టలు మరింత పెరిగిపోతున్నాయి. లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యిల్ అజీమ్.

సర్వోన్నతుడైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు -

**"మీరు అల్లాహ్‌ను కాదని వేడుకునే మీ దేవీలు ఆయన కలిగించే నష్టం నుండి నన్ను కాపాడగలరా? లేదా అల్లాహ్ నాపై కనికరం చూపగోరితే, వారు ఆయన కారుణ్యాన్ని అడ్డుకోగలరా? మీ అభిప్రాయ మేమిటీ? కనుక వారితో ఇలా అను : 'నాకు అల్లాహ్ ఒక్కడే చాలు. నమ్ముకునే వారు ఆయననే నమ్ముకుంటారు."**

**(అజ్ జుమర్ : 38)**

ఇంకా ఈ విధంగా ఉపదేశించబడింది -

**"కలత చెందినవాడు మొర పెట్టుకున్న ప్పుడు, అతని మొరను ఆలకించి, అతని బాధను తొలగించేవాడు ఎవడు? భూమిపై మిమ్మల్ని ప్రతినిధులుగా చేసినవాడు ఎవడు? అల్లాహ్‌తో పాటు (ఈ పనులు చేసే) మరొక దేవుడు కూడా ఎవడయినా ఉన్నాడా? కాని మీరు చాలా తక్కువగా ఆలో చిస్తారు?" (అన్ నమల్ : 62)**

ఇంకా ఈ విధంగా సెలవీయబడింది :

**"ఆయనను కాదని మీరు పిలిచే ఇతరులు కనీసం ఒక గడ్డిపోచకు కూడా యజమానులు కారు. వారిని వేడుకుంటే, వారు మీ ప్రార్థనలను వినలేరు. ఒకవేళ విన్నా, వాటికి ఏ సమాధానమూ మీకు ఇవ్వలేరు. మీరు కల్పించిన దైవత్వపు భాగస్వామ్యాన్ని వారు ప్రళయం నాడు తిరస్కరిస్తారు. సత్యాన్ని గురించిన ఈ సరైన సమాచారాన్ని తెలిసినవాడు తప్ప మరొకడెవ్వడూ మీకు అందజెయ్యలేడు."**

(ఫాతిర్ - 13, 14)

ఇంకా ఈ విధంగా కూడా ఉపదేశించబడింది -

**"అల్లాహ్‌ను కాదని, ప్రళయం వచ్చే వరకు అతనికి సమాధానమైనా ఇవ్వలేని వారిని, మొరపెట్టుకునే వారు తమకు మొరపెట్టుకుంటున్నారనే విషయం కూడా ఎరుగని వారిని వేడుకునే వాడికంటే పరమభ్రష్టుడైన మానవుడు ఎవడు ఉంటాడు? మానవులందరినీ సమావేశ పరచినప్పుడు, వారు తమనువేడుకున్న వారికి విరోధులై పోతారు. వారి ఆరాధనను తిరస్కరిస్తారు." (అల్ అహ్‌ఖాఫ్ - 5,6)**

# గత కాలపు సజ్జనుల విశ్వాసం

- షేఖ్ ముహద్దిస్ ముహమ్మద్ తయ్యిబ్ బిన్ ఇస్‌హాఖ్ అన్సారీ మదనీ

దైవస్తోత్రానంతరం . . . నేను చెప్పదలచుకున్నదేమిటంటే, అల్లాహ్ ఒక్కడే. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. ఆయన ఏకేశ్వరుడు. అక్కరలేనివాడు. ఆయన ఎవరినీ కనలేదు. ఆయన్ని ఎవరూ కనలేదు. ఆయన అద్వితీయుడు. సహవర్తులెవరూ లేని వాడు. ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధనకు, అర్చనలకు అర్హులు కారు. అల్లాహ్‌ను గాక మరెవరినయినా సరే, ఏ విధంగానయినా సరే ఎవరయినా పూజిస్తే అతడు ముష్రిక్కు మరియు కాఫిర్ అవుతాడు - ఇదీ మా విశ్వాసం!

అల్లాహ్‌కు ఇష్టమయిన, ప్రియాతి ప్రియమైన వాక్కాయ కర్మలే 'ఆరాధన' లేక 'ఇబాదత్' అనబడతాయి. ఉదాహరణకు :ఇస్లాంలోని అయిదు ప్రధానాంశాలు (అంటే; **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** గురించి సాక్ష్యమివ్వటం, నమాజును నెల కొల్పటం, జకాత్ అనే విధి దానాలివ్వటం,రమజాన్ నెల ఉపవాసాలు పాటించటం, స్థోమత ఉన్న పక్షంలో హజ్ చేయటం) నిర్వర్తించటం, దైవాన్ని వేడుకోవటం, ఆయన సన్నిధిలో భయపడటం, ఆయనపైనే భారం వేయటం, ఆయన సామీప్యం కోసం పరితపించటం, ఆయన మెప్పు కోసమే త్యాగం చేయటం, ఆయన పేరుతోనే మొక్కుకోవటం మొదలగునవి.

మరో విషయం ఏమిటంటే అల్లాహ్ ఉత్తమ గుణగణాలతో వినుతి కెక్కాడు. అదీగాక ఆయనకు శుభ నామాలున్నాయి. వాటిని ఆయన స్వయంగా వివరిం చాడు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా దేవుని ఆ శుభ నామాలను మనకు విశదీకరించారు. ఈ గుణగణాలన్నీ వాస్తవికమైనవేగాని ఆపాదించబడినవి కావు.

ఈ గుణగణాలలోని ఒకానొక గుణ దర్పం ఆయన స్వయంగా సింహాసనాన్ని అలంకరించటం! ఆ అలంకరణ అన్ని రకాల భావాలు, భావనలకు, ఉపమానా లకు అతీతమైనది!! "అల్లాహ్ అర్ష్ - సింహాసనంపై ఆసీనుడయ్యాడ"న్న

ఆయన వాక్కే దీనికి ప్రబల నిదర్శనం.

అల్లాహ్ సంభాషించేవాడు. పూర్వీకుల్లోని సజ్జనులు నుడివినట్లు, ఆయన ఆది నుండీ మృదుభాషి. ఆయన, తాను తలచినప్పుడు సంభాషిస్తాడు. ఖుర్ఆన్ కూడా ఆయన ప్రవచనమే. దివ్య ఖుర్ఆన్ మహాప్రవక్త ముహమ్మద్ (స) పై అవతరించిన దైవవాక్కు. దైవదాస్య విధానం తెలియజేసే నిమిత్తం దైవం తన ఈ వాక్కును ఆయన (స) పై అవతరింపజేశాడు. దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) అల్లాహ్ వద్ద ఈ వాక్కులు విని, దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) కు యథాతథంగా-విన్నది విన్నట్టుగా-భావార్థంతో సహా అందజేశారు. కాబట్టి ఖుర్ఆన్ దైవగ్రంథం అన్న సత్యాన్ని మనం గమనించాలి. అంతేగానీ అది జిబ్రయీల్ ప్రోక్తమో, ముహమ్మద్ (సఅసం) గారి పలుకులో కావు. ఆ గ్రంథాన్ని ఎవరెంతగా ఆస్వాదించినా, అది దేవుని వచనంగానే ఉంటుంది. ఉదాహరణకు దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) వృక్షం వద్దకు ఏతెంచినపుడు అల్లాహ్ స్వయంగా ఎలుగెత్తి ఇలా సంభాషించాడు -

**"(ఓ మూసా!) నేనే నీ ప్రభువును. చెప్పులు విడువు. (ఎందుకంటే) నీవు పవిత్రమైన లోయలో ఉన్నావు." (తాహా - 12)**

ప్రళయ దినాన కూడా ఆయన తన దాసులను ఈ విధంగానే పిలుస్తాడు (నేను మాత్రమే సార్వభౌముడను. ప్రతిఫలం ప్రసాదించేవాణ్ణి నేనే అని ఆయన ఎలుగెత్తి ప్రకటించినపుడు) దూరం నుంచి కేకవేసినా దగ్గరి నుంచి పిలిచినట్లే అనిపిస్తుంది. ఈ విధమైన సంభాషణను ఆయన తాను తలచిన ప్రవక్తలతో, దూతలతో, దాసులతో జరుపుతాడు. లేదా వారిపై తన గ్రంథాలను అవతరింప జేస్తాడు. ఆయన వాక్కు అంతం లేనిది. అయితే ఆయన వాక్కు ఒక 'సృష్టితం' కాదు. అదొక 'గుణం' మాత్రమే. కాగా; ఆయన గుణగణాలన్నీ సృష్టేతరాలు.

ఇంకా నా నమ్మకం ఏమిటంటే; అల్లాహ్ ప్రేమమయుడు. ఆయన ప్రేమిస్తాడు. ప్రసన్నుడవుతాడు. అయిష్టతను కూడా వ్యక్తపరుస్తాడు. తేజరిల్లుతాడు. జీవన్మరణాలను ఒసగుతాడు. ఆగ్రహిస్తాడు. తన దాసులు చెందే పశ్చాత్తాపంపై అమితానందం చెందుతాడు.

విశ్వాసులు ప్రళయదినాన అల్లాహ్‌ను తమ కనులతో తిలకిస్తారని నేను విశ్వసిస్తున్నాను-దివ్య ఖుర్ఆన్‌లోనూ, హదీసులలో కూడా దీనికి ఆధారం లభిస్తోంది. దేవుని యొక్క ఈ గుణగణాల దర్పంఅంతాయదార్థమైనది. కాల్పనికం కానేకాదు. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

**"(ఓ ప్రవక్తా! జనులతో) ఇలా చెప్పెయ్యి : ఆయన, అంటే అల్లాహ్ ఒక్కడే, ఆయన అద్వితీయుడు, అల్లాహ్ నిరపేక్షాపరుడు-ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేని వాడు; అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు." (అల్ ఇఖ్లాస్ : 1 - 4)**

ఇదీ మా విశ్వాసం! మన నిజధర్మం విషయంలోనూ, అల్లాహ్ పేర్లు మరియు గుణగణాల విషయంలోనూ మేము ఎలాంటి భావావేశాలకు గానీ, ఉపమానా లకు గానీ వివశులయ్యే వారము కాము. అల్లాహ్ ఖుద్దుగా ఉపదేశించినట్లు-"ఆయనను పోలిన వస్తువు సృష్టిలో ఏదీ లేదు. ఆయన అన్నీ వినేవాడు అన్నీ చూసేవాడూను." (షూరా - 11)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) దేవుని దాసులనీ, సమస్త జిన్నుల, మానవుల కోసం ప్రవక్తగా ప్రభవింపజేయబడ్డారని కూడా మేము సాక్ష్యమిస్తున్నాము. ప్రవక్తగాఆయన (స) తనకర్తవ్యాన్ని నెరవేర్చారు. తనకు అప్పగించబడిన విషయాన్ని ఆయన (స) నిజాయితీగా అందజేశారు. తన అనుచర సమాజం శ్రేయోభిలాషిగా ఆయన (స) హితోపదేశాన్ని పూర్తిగా వినిపించారు. నిర్విరామంగా ఆయన (స) దైవమార్గంలో పోరాడారు. కడకు అల్లాహ్ ఆయన(స) ద్వారా జీవన ధర్మాన్ని పరిపూర్ణంగావిస్తూ ఈ విధంగా సెలవిచ్చాడు :

**"ఈ రోజు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ కొరకు ఇస్లాంను మీ జీవన ధర్మంగా అంగీకరించాను."**

**(అల్ మాయిద - 3)**

ఆ తరువాత అల్లాహ్ ఆయన్ని తన దగ్గరకు పిలుచుకున్నాడు. ఆయన (సఅసం) ఈ అశాశ్విత ప్రపంచాన్ని, ఆలుబిడ్డలను విడిచి తన పరమోన్నత మిత్రుని వద్దకు సాగిపోయారు.

ఇంకా మా విశ్వాసం ఏమిటంటే, ఏ వ్యక్తయినా సరే తన ఆశలు ఆకాంక్ష లను ఆయన (సఅసం) అందజేసిన షరీయత్‌కు కట్టుబడి ఉండేలా మలచుకో నంతవరకూ, తన ధన ప్రాణాల కన్నా, తనసంతానం కన్నా, సమస్త జనుల కన్నా అధికంగా ఆయన్ని (సఅసం) ప్రేమించనంతవరకూ అతడు సంపూర్ణ విశ్వాసి కాజాలడు. ఆయన్ని అమితంగా ప్రేమించటం అంటే అర్థం ఏమిటీ? ఆయన(స) ఆజ్ఞాపించిన వాటికి తలవంచటం! ఆయన (స) అందజేసిన విషయాన్ని సత్యమని ధృవీకరించటం!! ఆయన(స)చేయవద్దన్న పనులకు దూరంగా ఉండటం!!! ఇంకా, కేవలం షరీయత్ విధానాన్ననుసరించి దైవారాధన చేయాలి. మితిమీరి ఆయన్ని (స) పొగడటం ప్రేమకు ప్రతిరూపం కాదు. అతిశయిల్లటం అనురాగానికి ఆనవాలు కానేకాదు. ఆయన్ని (సఅసం) మొర పెట్టుకుని, అల్లాహ్ ఆయన (స)కు ప్రసాదించిన స్థానం కన్నా పెద్ద స్థానం కల్పించటం సమంజసం కాదు. మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రబోధించారు : 1. "దుఆ (ప్రార్థన) అసలు ఆరాధన" 2. "మీరు నన్ను మొర పెట్టుకోకండి. మొరపెట్టుకోవలసింది గౌరవోన్నతుడైన అల్లాహ్‌నే."

మహాప్రవక్త (సఅసం)ను మొర పెట్టుకోవటం అంటే అర్థం అల్లాహ్‌కు సాటి కల్పించటమే. ఒక మేలును పొందటానికైనా, ఒక కీడును తొలగించ

టానికైనా దైవేతరులతో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సంబంధం ఏర్పరచుకోవటం ముమ్మాటికీ షిర్కే అంటే వలీలను, పుణ్యపురుషులను ఆశ్రయించటం, జిన్నాతుల శరణు వేడటం, కష్టాలు కడగండ్ల నుండి విముక్తి కోసం రకరకాల ప్రార్థనల ద్వారా ఆయా శక్తులను ప్రసన్నుల్ని చేయజూడటం, వారితో ఆధ్యాత్మిక బంధాన్ని పెట్టుకోవటం షిర్క్. అది తాంత్రిక చర్యల ద్వారా జరిగినా, వసీలా ద్వారా జరిగినా-ఇదంతా మార్గవిహీనతగానే భావించబడుతుంది. దైవగ్రంథం మరియు దైవప్రవక్త (సఅసం) దృష్టిలో ఇదంతా మిథ్య మాత్రమే. ఈ మిథ్యా భావనలను కూకటి వ్రేళ్లతో పెకలించి, ప్రజల హృదయాలను శుద్ధి చేయడానికే అల్లాహ్ తన గ్రంథాన్ని అవతరింపజేశాడు. తన ప్రవక్త (స)ను ప్రభవింపజేశాడు - ఇదీ ఈ విషయంలో మా ప్రగాఢ నమ్మకం.

ఇంకా మా నమ్మకం ఏమిటంటే; దైవదూతలు మరియు దైవగ్రంథాలు అనేవి సత్యం. దైవప్రవక్తల ప్రవచనం కూడా సత్యబద్ధమే. మరణానంతరం తిరిగి లేపబడటం అనేది సత్యబద్ధం. మన ప్రవక్త (సఅసం)కు 'కౌసర్ సరస్సు' ప్రసాదించబడిందనే విషయం సత్యం. ఆ సరస్సులోని జలాన్ని త్రాగిన వ్యక్తికి ఇక ఎన్నడూ దాహం అవదు. దీన్ (ధర్మం)లో సరికొత్త పోకడలను సృష్టించిన వ్యక్తి ఆ సరస్సుకు దూరం చేయబడతాడు. మంచి జరిగినా, చెడు జరిగినా అది దైవం తరఫుననే జరుగుతుందన్న విషయంపై మాకు గట్టి విశ్వాసముంది. మన అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), సమస్త ప్రవక్తలు (అలైహిము స్సలాం) మరియు సజ్జనుల సిఫారసును అల్లాహ్ సమ్మతిస్తాడన్నది సత్యం. అయితే అల్లాహ్ అనుమతిపైనే ఇది ఆధారపడి ఉంటుందన్నది తిరుగులేని వాస్తవం. ఆ విషయాన్ని అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిచ్చాడు -

**"ఆయన సన్నిధిలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగలవాడెవ్వడు? (బఖర - 255)**

**"సిఫారసు వినటానికి అల్లాహ్ ఇష్టపడినవాని విషయంలో తప్ప వారు ఎవరి గురించీ సిఫారసు చెయ్యలేరు."(అల్ అంబియా - 28)**

ఇంకా మా విశ్వాసం ఏమిటంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అందరికన్నా ముందు సిఫారసు చేస్తారు. అందరికన్నా ముందు ఆయన (సఅసం) సిఫారసు స్వీకరించబడుతుంది. ఆయన (స) చేసే సిఫారసులో వేరొకరు భాగస్థులుగా ఉండరు. వాటిలో కర్మల లెక్కకు సంబంధించిన సిఫారసు ఒకటి - అది మఖామె మహ్మూద్ (ప్రశంసాపాత్రమైన స్థానం) అనబడుతుంది. ఈ అత్యున్నత స్థానాన్ని చూసి దైవప్రవక్తలు, సత్పురుషులు కించిత్ ఈర్ష్య (రష్క్) చెందుతారు. కాగా; నరకాగ్నికి *ఆహుతి అయిపోయినవారిని నరకయాతన నుండి వెలికితీసే సిఫారసు రెండవది. పాపాత్ములైన విశ్వాసులు నరకంలో కొంతకాలం ఉండి, పాప ప్రక్షాళన చేసుకున్న తరువాత, నరకం నుంచి విముక్తి కల్పించి,

స్వర్గంలోకి తీసుకుపోబడ టానికి సంబంధించిన సిఫారసు మూడవది.

ఇంకా మా నమ్మకం ఇది : అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో విశ్వసించి, ఆయన (స) సహచర్యం పొందినవారి కాలం అత్యు త్తమ కాలం. వీళ్ళంతా సహాబీలు (ప్రవక్త ప్రియ సహచరులు)గా వ్యవహరించబడ్డారు. ఆ తరువాత ఈ సహాబీలను ఖచ్చితంగా అనుసరించినవారి కాలం మంచికాలం. మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించారు :"నా కాలం అత్యుత్తమమైనది. ఆ తరువాత వారి తరానిది. ఆ తరువాత వారి అనుయాయు లది."

అన్నిటికన్నా ఉత్తమమైన వాక్కు అల్లాహ్ వాక్కు. అన్నింటికన్నా ఉత్తమ మైన విధానం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి విధానం. అన్నిటికన్నా నీచమైన చేష్ట ధర్మం (దీన్) లో కొత్త పుంతలు తొక్కటం (బిద్అత్‌కు పాల్పడటం). కాగా; ప్రతి కొత్త పోకడ మార్గభ్రష్టతకు దారితీస్తుంది.

వివరాల్లోకిపోతే విషయం సుదీర్ఘమవుతుందన్న భయంతో మేము సంక్షిప్తంగా విశదీకరించాము. ఒక్కో విషయానికి ఆధారం, నిదర్శనం ఇస్తూపోతే విషయం పొడవైపోతుంది.

సమస్త వాక్కాయ కర్మలలో మనందరినీ సన్మార్గాన నడిపించాలనీ, అన్ని రకాల అంతర్బాహ్యాల ఉపద్రవాల నుంచి కాపాడమనీ, ఇస్లాంపై స్థయిర్యాన్ని ప్రసాదించ మనీ, ఇస్లాంపైనే తుదిశ్వాస వదిలే భాగ్యం ప్రసాదించమనీ అల్లాహ్‌ను ఈ సందర్భంగా వేడుకుంటున్నాము.

ఇదొక హితోపదేశం. షేఖ్ ముహమ్మద్ తయ్యిబ్ బిన్ ఇస్హాఖ్ అన్సారీ గారు హిజ్రీ 1358లో మదీనా మునవ్వరాలో తన ముస్లిం సోదరుల శ్రేయాన్ని అభిలషిస్తూ ఈ హితోపదేశం చేశారు. అల్లాహ్ ఆయనపై తన కారుణ్యాన్ని కురిపించు గాక!.....ఆమీన్

وصلى الله على عبده ورسوله نبينا مُحمّد
واله واصحابه با حسان الى يوم الدين

సమాప్తం

*******

* యదార్థం ఏమిటంటే తమ పాపాల కారణంగా నరకాగ్నికి ఆహుతి అయిపోయిన వారిని నరకం నుంచి బయటికి తీయించే సిఫారసు ఒక్క మహాప్రవక్త (సఅసం)కు మాత్రమే ప్రత్యేకం కాదు. పైగా ఈ సిఫారసు ఉమ్మడి విషయం. అనేక హదీసుల ద్వారా కూడా ఈ సంగతి తేటతెల్లమవుతున్నది. అయితే తన సిఫారసు ద్వారా జనులకు స్వర్గ భాగ్యం చేకూర్చే అవకాశాన్ని అల్లాహ్ ఆయన (స)కు ప్రత్యేకంగా కల్పించాడు. అదే విధంగా తన పినతండ్రి అయిన అబూతాలిబ్ శిక్షను తగ్గించమంటూ ఆయన (స) చేసిన సిఫారసును కూడా అల్లాహ్ ఆయన విషయంలో ప్రత్యేకంగా స్వీకరించాడు.